ప్రత్యేక చదువు..!

పది ఫెయిల్ అయినవారికి రెమెడియల్ తరగతులు

- ఒకటో తేదీ నుంచి 18 వరకూ పాఠశాలల్లో నిర్వహణ
- జిల్లావ్యాప్తంగా 7,242 మందికి శిక్షణ
- మండలానికి ఒకటి లేదా రెండు పాఠశాలల ఎంపిక
- విద్యార్థులకు మధ్యాహ్న భోజనంపై అస్పష్టత

సబ్జెక్టుల వారీగా ఫెయిల్ అయిన విద్యార్థులు	
తెలుగు	2934
హిందీ	924
ఇంగ్లీష్	2288
గణితం	7012
సైన్స్	5502
సోషల్	4675

అనంతపురం విద్య, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు విద్యాశాఖ అండగా నిలుస్తోంది. అడ్వాన్స్‌డ్ సప్లిమెటరీ పరీక్షల్లో పాయస్యే విధంగా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. రెమెడియల్ క్లాసెస్ పేరిట మే ఒకటో తేదీ నుంచి 18వ తేదీ వరకూ విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయనుంది. ఈ మేరకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలకు 30,700 మంది హాజరయ్యారు. వీరిలో 9,190 మంది ఫెయిల్ అయ్యారు. గణితం, జనరల్ సైన్స్ సబ్జెక్టులలో ఎక్కువ మంది ఫెయిల్ అయినట్లు గుర్తించారు. ఇప్పటికే కేజీబీవీల్లో రెమెడియల్ క్లాసులను ప్రారంభించారు. విద్యాశాఖ, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

నష్టపోకుండా..

ఫెయిల్ అయిన విద్యార్థులు ఒక విద్యా సంవత్సరాన్ని నష్టపోకుండా చూడాలని విద్యాశాఖ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను ఏటా నిర్వహిస్తోంది. ఈ ఏడాది మే 19 నుంచి 28వ తేదీ వరకూ అడ్వాన్స్‌డ్ సప్లీ పరీక్షలను నిర్వహిస్తారు. పరీక్షలకు తగినంత గడువు ఉన్నందున.. ఫెయిల్ అయిన సబ్జెక్టుల తరగతులు నిర్వహించి, ప్రిపరేషన్ చేయించాలని నిర్ణయించారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ తరగతులను నిర్వహిస్తారు. సబ్జెక్టుల వారీగా ఫెయిల్ అయిన విద్యార్థుల జాబితాను విద్యాశాఖ అధికారులు ఆయా మండలాలకు పంపారు. విద్యార్థుల సంఖ్యను బట్టి, ఎండలకు ఇబ్బంది లేకుండా, ప్రతి మండలంలో రెండు లేదా మూడు పాఠశాలలను రెమెడియల్ క్లాసులకు ఎంపిక చేయనున్నారు. అందుబాటులో ఉన్న సబ్జెక్టు టీచర్లను ఎంపిక చేసి, వారితో రొటేషన్ పద్ధతిలో శిక్షణ ఇప్పిస్తారు.

టైంటేబుల్ ఇలా...

మే 1వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. ఉదయం 8 గంటల నుంచి 9.15 వరకూ హిందీ, సోషల్, ఉదయం 9.15 గంటల నుంచి 10.15 గంటల వరకూ ఇంగ్లిష్, ఫిజిక్స్, బయాలజీ బోధిస్తారు. 10.15 గంటల నుంచి 10.30 గంటల మధ్య విరామం ఇస్తారు. ఆ తరువాత 10.30 గంటల నుంచి 12 గంటల వరకూ తెలుగు, గణితం బోధిస్తారు.



విద్యార్థులకు క్లాస్ చెబుతున్న ఏపీసీ శైలజ

7242 మందికి శిక్షణ

జిల్లాలో మొత్తం 9,190 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. వీరిలో ప్రైవేట్ మినహా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 7,242 మంది విద్యార్థులు ఉన్నారు. కేజీబీవీల్లో 303 ఫెయిల్ అయ్యారు. వీరికి ఈనెల 26 నుంచే ప్రత్యేక తరగతులు మొదలయ్యాయి. విద్యార్థుల సౌకర్యం మేరకు గుమ్మఘట్ట, తాడిపత్రి, శింగనమల, ఉరవకొండ, కళ్యాణదుర్గం కేంద్రాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు.



భోజనం ఎలా..?

రెమెడియల్ క్లాసులకు వచ్చే విద్యార్థులకు భోజనం విషయంలో స్పష్టత లేదు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ తరగతులు నిర్వహిస్తారు. ఉదయం హడావుడిగా కొందరు తిని వస్తే, మరి కొందరు తినకుండానే వస్తారు. వేసవి తీవ్రత నేపథ్యంలో ఖాళీ కడుపులతో వచ్చే విద్యార్థులు మధ్యాహ్నం ఇంటికి వెళ్లేదాకా ఏమీ తినకపోతే ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది. చాలా పాఠశాలలు విద్యార్థుల ఇళ్లకు దూరంగానే ఉన్నాయి. కాబట్టి అర గంట లేదా గంట ముందుగానే పాఠశాలలకు బయలుదేరాల్సి ఉంటుంది. పైగా ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేవారిలో ఎక్కువశాతం పేద విద్యార్థులు ఉంటారు. వీరి ఇళ్లలో ఉదయం 7 గంటలకే భోజనం పెట్టి పంపించడం గగనమే. కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో ఉండే విద్యార్థులకు అక్కడే భోజనం అందుతుంది. కానీ జడ్పీ, మున్సిపల్, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠశాలల్లో భోజనం పెట్టకపోతే ఇబ్బందులు ఎదుర్కొంటారు. మధ్యాహ్న భోజనం పెట్టకపోతే ప్రత్యేక తరగతులకు కొందరు గైర్హాజరయ్యే ప్రమాదం కూడా ఉంటుంది. ఉన్నతాధికారులు దీనిపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.



మ్యాపింగ్ చేస్తున్నాం..

10వ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు రెమెడియల్ క్లాసులు నిర్వహించాలని కమిషనర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. మండలాల్లో ఫెయిల్ అయిన పిల్లల సంఖ్య ఆధారంగా ఒకటి లేదా రెండు పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తాం. ఫెయిల్ అయిన విద్యార్థులు, బోధించే టీచర్లను మ్యాపింగ్ చేస్తున్నాం. డేటా పంపాలని ఎంఈఓలను ఆదేశించాము. ఈ ప్రక్రియ బుధవారంతో పూర్తవుతుంది. ఒకటో తేదీ నుంచి క్లాసులు మొదలవుతాయి. పిల్లలకు మధ్యాహ్న భోజనం పెట్టే అంశంపై రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

-ప్రసాద్‌బాబు, డీఈఓ

ప్రత్యేక శ్రద్ధ పెట్టాం..

కేజీబీవీ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. ఐదు ప్రాంతాల్లో తరగతులు నిర్వహిస్తున్నాం. కేజీబీవీ సిబ్బందికి అదనంగా జడ్పీ, మున్సిపల్ టీచర్లను ప్రత్యేకంగా రప్పించి, పాఠాలు చెప్పించేలా ప్రణాళిక వేసుకున్నాం. పది, ఇంటర్ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. వచ్చే నెల 12 వరకూ ఇంటర్ విద్యార్థులకు, 15వ తేదీ వరకూ టెన్త్ విద్యార్థులకు రెమెడియల్ క్లాసులు నిర్వహిస్తాం.

-శైలజ, ఏపీసీ



పెద్దారెడ్డిని ఆహ్వానిస్తే ఊరుకోను

- వైసీపీ వర్గీయులకు జేసీ ప్రభాకర్ రెడ్డి హెచ్చరిక
- కండ్లగూడూరు పర్యటనపై అభ్యంతరం
- పెద్దారెడ్డిని అడ్డుకుని.. తిప్పి పంపిన పోలీసులు



నగరూరు వద్ద చెట్టుకింద కూర్చున్న పెద్దారెడ్డి

పెద్దవడుగూరు/పెద్దపప్పూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు పెద్దారెడ్డి పర్యటన మంగళవారం ఉద్రిక్తతలకు దారితీసింది. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి అభ్యంతరం తెలపడం, పోలీసులు పెద్దారెడ్డిని మార్గ మధ్యంలోనే అడ్డుకోవడంతో నియోజకవర్గంలో ఉత్కంఠ రేపింది. పెద్దారెడ్డిని పెద్దవడుగూరు మండలం కండ్లగూడూరు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త నాగిరెడ్డి విందుకు ఆహ్వానించారు. విషయం తెలుసుకున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి దాదాపు 50 వాహనాల్లో అనుచరులతో కలిసి కండ్లగూడూరుకు చేరుకున్నారు. వైసీపీ కార్యకర్త నాగిరెడ్డిని పిలిపించి మాట్లాడారు. 'నువ్వు ఏ నాయకున్ని విందుకు ఆహ్వానించినా నాకు అభ్యంతరం లేదు. పెద్దారెడ్డిని పిలిస్తే మాత్రం నేను ఒప్పుకోను. పెద్దారెడ్డిని ఎవరు పిలిచినా నేరుగా వారి ఇంటి వద్దకు వచ్చి కూర్చుంటా. వైసీపీ నాయకులు మీ పనులు మీరు చేసుకుంటున్నారు. నాకు అభ్యంతరం లేదు. మీ జోలికి కూడా రాను. పెద్దారెడ్డి వల్ల మా కుటుంబం ఐదేళ్లు ఇబ్బంది పడింది. నేను ఇంట్లో లేనప్పుడు మా ఇంట్లోకి వచ్చి వెళ్లాడు..' అని ప్రభాకర్ రెడ్డి సున్నితంగా హెచ్చరించారు. ఎన్నికల్లో ఓడినా, గెలిచినా ఫ్యాక్షన్ చేస్తానని పెద్దారెడ్డి అన్నారని, దీంతో నియోజకవర్గ ప్రజలు ఆయనపై ఆగ్రహంగా ఉన్నారని అన్నారు. ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలోకి ఫ్యాక్షన్ చేస్తానన్న పెద్దారెడ్డిని రప్పించేందుకు ఒప్పుకోనని స్పష్టం చేశారు.

అడ్డుకున్న పోలీసులు

పెద్దపప్పూరు మండలం మీదుగా వెళుతున్న పెద్దారెడ్డిని యాడికి మండలం నగరూరు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. తాడిపత్రి నియోజకవర్గంలోకి వస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని అన్నారు. వెనక్కు వెళ్లిపోవాలని సూచించారు. తాను వెళ్లేది లేదని పెద్దారెడ్డి భీష్మించారు. అక్కడే చెట్టు కింద ఉన్న ఓ మంచంపై కూర్చున్నారు. ఈ విషయం తెలుసుకున్న జేసీ ప్రభాకర్ రెడ్డి కండ్లగూడూరు నుంచి నగరూరుకు బయలుదేరారు. దీంతో పోలీసులు అప్రమత్తమై పెద్దారెడ్డిని వాహనం ఎక్కించి నియోజకవర్గ సరిహద్దులు దాటించారు.

పరిశ్రమలకు స్వర్గధామం 'దుర్గం'

- ఔత్సాహికులకు సహకరిస్తాం
- ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఏర్పాటుకు రాయదుర్గం ఒక స్వర్గధామమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. కలెక్టర్ వినోద్ కుమార్ అధ్యక్షతన పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి కాలవ మాట్లాడారు. అత్యంత వెనుకబడిన రాయదుర్గం ప్రాంతాన్ని అభివృద్ధికి చిరునామాగా మార్చడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలన్నారు. పరిశ్రమలు పెట్టడానికి ముందుకు వచ్చేవారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వారిపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు ఉండవని హామీ ఇచ్చారు. ఇక్కడి ప్రజలు కూడా శాంతస్వభావులని, భూమి అందుబాటు ధరలో లభిస్తుందన్నారు. ముఖ్యంగా ముడిఖనిజం, నీటికి ఎలాంటి ఢోకా లేదన్నారు. అవసరమైన కూలీలు అందుబాటులో ఉన్నారని, సాంకేతిక నైపుణ్యం కలిగిన వారి అవసరం ఉంటే ఇక్కడి యువతకు ఆయా విభాగాల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామన్నారు. పారిశ్రామికవేత్తల రాకపోకలకు బళ్లారిలోని విమానాశ్రయం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాంతంపై అభిమానంతో అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నారన్నారు. బళ్లారిలో ఇదివరకే పరిశ్రమలు నిర్వహిస్తున్న వారు తదుపరి విస్తరణకు రాయదుర్గంను ఎంపిక చేసుకోవచ్చన్నారు.

పింఛన్ పంపిణీకి రూ.124.95 కోట్లు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి మే నెలకు సంబంధించి రూ.124.95కోట్లు మంజూరైనట్లు కలెక్టర్ వినోద్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఒకటో తేదీ ఉదయం 7గంటలకు గ్రామ-వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారులకు ఇంటి వద్దే పింఛన్ అందజేస్తారన్నారు. మొదటి రోజే పింఛన్‌దారులందరికీ పింఛన్ పంపిణీ చేస్తారని, సాంకేతిక కారణాలతో సమస్యలు వస్తే రెండో రోజు పింఛన్ పంపిణీ పూర్తి చేస్తారని తెలిపారు. కాగా జిల్లాలో మొత్తం 2,89,999 మంది పింఛన్‌దారులు ఉన్నట్లు తెలిపారు.

మిర్చి వెలవెల..!

7 పాతాళానికి పడిపోయిన ధరలు

మట్టి దొంగ..!

కంకర మాటున మట్టి అక్రమ రవాణా



నరసనాయని కుంట-కోటంక రోడ్డుకు మట్టిని అన్‌లోడ్ చేస్తున్న టిప్పర్



నారాయణపురం సమీపంలోని లేఅవుట్‌కు తోలిన మట్టి

అనంతపురం రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మట్టి అక్రమ రవాణా మండలంలో జోరుగా సాగుతోంది. ముఖ్యంగా నరసనాయనికుంట గ్రామ పరిధిలో మరింత ఎక్కువగా సాగుతోంది. గ్రామ సమీపంలో ఓ స్టోన్ క్రషర్ యజమాని యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా సాగిస్తున్నాడు. సదరు వ్యక్తికి క్రషర్‌లో కంకర కంటే మట్టి రవాణా అధిక లాభం తెచ్చిపెడుతున్నట్లు తెలుస్తోంది. రోజూ పదుల సంఖ్యలో మట్టిని అక్రమ రవాణా చేస్తూ గుట్టను కొల్ల గొడుతున్నారు. నగరానికి అతి సమీపంలో పెద్దఎత్తున మట్టి అక్రమ రవాణా సాగుతున్నా.. సంబంధిత అధికారులు అటువైపు చూడని పరిస్థితి. మట్టి రవాణాపై ప్రశ్నిస్తే.. ప్రజాప్రతినిధుల పేర్లు చెబుతున్నట్లు సమాచారం. దీంతో క్రషర్ యజమాని మట్టి అక్రమ రవాణాకు అవధుల్లేకుండా పోయాయి.

కంకర మాటున...

మండలంలోని పాపంపేటలో నివాసముంటున్న ఓ వ్యక్తి కొన్నేళ్ల కిందట నరసనాయనికుంట గ్రామ సమీపంలో స్టోన్ క్రషర్‌కు అనుమతులు తీసుకున్నాడు. మొదట్లో క్రషర్‌కు కూడా సరైన అనుమతులు పొందకుండానే కంకర రవాణా సాగించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మట్టి అక్రమ రవాణా సాగిస్తున్నాడు. మట్టి రవాణాకు అనుమతులు లేకపోయినా.. కంకర మాటున గుట్ట నుంచి మట్టి రవాణా సాగిస్తున్నాడు. దూరాన్ని బట్టి ధర నిర్ణయించి, విక్రయిస్తున్నాడు. టిప్పర్ సరాసరి రూ.5వేలతో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. రోజుకు ఎంతలేదన్నా.. 50 టిప్పర్లకు పైగా రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామంతోపాటు నగర చుట్టుపక్కల ప్రాంతాల్లోని లేఅవుట్లకు మట్టిని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నాడన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఎ.నారాయణపురం గ్రామ సమీపంలో మూడెకరాలకు పైగా కొనుగోలు చేశాడు. ఆరు నెలల కిందట ఆ భూమి చదును చేసేందుకు వెయ్యి టిప్పర్లకుపైగా తోలినట్లు తెలుస్తోంది.

ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పి..

మట్టి అక్రమ రవాణాదారుడు గత ప్రభుత్వంలో వైసీపీ నాయకుడిగా చలామణి అయ్యాడు. అప్పటి ప్రజాప్రతినిధుల అండదండలతో పెద్దఎత్తున వ్యాపారం సాగించాడు. ప్రభుత్వం మారగానే ప్రస్తుత ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులకు అనుకూలంగా మారినట్లు తెలుస్తోంది. ఈక్రమంలోనే వారి పేరిటా జోరుగా మట్టి రవాణా సాగిస్తున్నాడు. ఎవరైనా ప్రశ్నించినా.. అడ్డుపడినా.. వెంటనే టీడీపీ నాయకుల పేరు చెప్పడం, 'వారికి ఫోన్ చేస్తా.. లేదంటే చేయిస్తా.. మాట్లాడండి..' అంటూ బెదిరిస్తున్నట్లు సమాచారం.

పట్టించుకోని అధికారులు

నగరానికి కూతవేటు దూరంలోని ప్రాంతంలో మట్టి అక్రమ రవాణా పెద్ద ఎత్తున సాగుతున్నా.. సంబంధిత అధికారులు అడ్డుకోకపోవడం గమనార్హం. అటువైపు కూడా తొంగిచూడట్లేదు. మట్టి అక్రమ రవాణాపై గ్రామస్థులు.. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. అయినా అధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. సంబంధిత అధికారులకు పెద్ద ఎత్తున ముడుపులు వెళ్తున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి.

థ్యాంక్యూ సర్..!

సీఎంను కలిసిన ముంటిమడుగు



చంద్రబాబుకు జ్ఞాపిక ఇస్తున్న ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు తదితరులు

బుక్కరాయ సముద్రం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ బ్యాంకు చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు ముంటిమడుగు కేశవరెడ్డి సీఎం చంద్రబాబును అమరావతిలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమపై నమ్మకం ఉంచి ఏడీసీసీబీ చైర్మన్ పదవి ఇచ్చినందుకు ఆయన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని సీఎం తనతో అన్నారని కేశవరెడ్డి తెలిపారు. శింగనమల నియోజకవర్గంలో నాయకులందరినీ కలుపుకుని వెళ్లాలని, అభివృద్ధి చేయాలని సూచించారని అన్నారు. జిల్లాలో సహకార బ్యాంకుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. సీఎంను కలిసినవారిలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు ఎద్దులపల్లి సుబ్రమణ్యం, రామలింగారెడ్డి ఉన్నారు.

విద్యా వ్యవస్థకు ఆదర్శం

స్కూళ్లలో సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం

● పంచాయతీకో మోడల్ ప్రైమరీ స్కూల్.. ● వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతి గ్రామ పంచాయతీలో మోడల్ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సాధ్యాసాధ్యాలను అన్వేషిస్తోంది. ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకించిన జీఓనెంబరు 117కు ప్రత్యామ్నాయంగా ఆదర్శపాఠశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈవిధానంపై విద్యాశాఖలో తీవ్ర కసరత్తు జరుగుతోంది.

287 పాఠశాలల మార్పు

జిల్లాలో 287 పాఠశాలలను మోడల్ స్కూళ్లుగా మార్చేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. గత ఏడాది డిసెంబరు ఆఖరునాటికి కనీసం 60 మంది విద్యార్థులున్న పాఠశాల లను ఎంపిక చేయనున్నారు. అయితే పంచాయతీలో ఏ పాఠశాలలోనూ అంతమంది విద్యార్థులు లేకపోతే 45 మంది విద్యార్థులున్న పాఠశాల లను కూడా పరిగణనలోకి తీసుకోనున్నట్లు సమాచారం.

ప్రతి తరగతికీ ఒక ఉపాధ్యాయుడు

ఎంపిక చేసిన ఆదర్శపాఠశాలలో ఒకటి నుంచి ఐదు వరకు ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమిస్తారు. విద్యార్థుల సంఖ్య 60 మందికి లోపు ఉంటే ఐదుగురు ఎస్జీటీలు ఉంటారు. ఆసంఖ్య 120 వరకు ఉంటే ప్రధానోపాధ్యాయుడిని నియమిస్తారు. విద్యార్థుల సంఖ్యను బట్టి అవసరమైతే రెండో పాఠశాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వనున్నారు.

గ్రామస్థులు కోరితే..

గ్రామపంచాయతీలో ఏ ప్రాథమిక పాఠశాలలోనైనా విద్యార్థుల సంఖ్య 45 మందికి మించి ఉంటే గ్రామస్థుల కోరిక మేరకు ఆపాఠశాలను ఆదర్శపాఠశాలగా మార్చనున్నారు. గ్రామపంచాయతీ తీర్మానం, విద్యాకమిటీ ఛైర్మన్, ఇతర సభ్యుల ఆమోదంతో ప్రక్రియను పూర్తి చేస్తారు.

విభజన ఆరు రకాలుగా....

జిల్లాలో మొత్తం 2097 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 1553 ప్రాథమిక పాఠశాలలు, 229 ప్రాథమికోన్నత పాఠశాలలు, 315 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిని ఆరురకాల పాఠశాలలుగా విభజించనున్నారు. ఇందులో ఆదర్శ పాఠశాలలు ప్రధానమైనవి. ప్రాథమిక విద్యలో నాణ్యతాప్రమాణాలు పెంచడమే ఆదర్శ పాఠశాల ఏర్పాటు చేయడంలో ముఖ్య ఉద్దేశం. ఈ నేపథ్యంలో ప్రస్తుత పాఠశాల ప్రాంగణాల్లో మౌలిక వసతులు, నూతనంగా కల్పించాల్సిన సౌకర్యాలపై ప్రాథమిక నివేదికలు ఇవ్వాలని జిల్లా విద్యాశాఖాధికారులు ఎంఈఓలను ఆదేశించారు.





ఆదర్శ పాఠశాల

విలీనం చేసిన తరగతులు వెనక్కు

వైసీపీ పాలనలో 3, 4, 5, తరగతులను ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. దీంతో నివాసానికి దూరంగా ఉన్న పాఠశాలకు వెళ్లలేక ఎక్కువ మంది విద్యార్థులు బడి మానేశారు. చాలా పాఠశాలల్లో అతితక్కువ మంది విద్యార్థులు మిగిలారు. కొన్ని పాఠశాలల్లో ఒకరు ఇద్దరు విద్యార్థులతో నెట్టుకొస్తున్నారు. అయితే ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో విలీనమైన తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలల్లోకి తీసుకురావాలని నిర్ణయం తీసుకుంది.



పుట్టపర్తి పట్టణం

సులభంగా అనుమతులు

కమిషనర్లకే పర్మిషన్ బాధ్యతలు

మున్సిపాల్టీలో ఐదంతస్తుల నిర్మాణం వరకూ...

బిల్డర్లకు తప్పిన వ్యయ ప్రయాసలు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మునిసిపాలిటీల్లో ఐదంతస్తుల భవననిర్మాణ అనుమతులు సులభతరం అయ్యాయి. గతంలో నాలుగు అంతస్తులకు మించి భవన నిర్మాణాలకు మున్సిపాలిటీ అధికారులు అనుమతి ఇచ్చేవారు కాదు. దీంతో పుడా, లేదా అహుడా అధికారుల నుంచి అనుమతి పొందాల్సి వచ్చేది. ఇందుకోసం భవన నిర్మాణదారులు ఎన్నో వ్యయప్రయాసలు ఓర్వాల్సి వచ్చేది. ఈ ఇబ్బందులను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కమిషనర్లకే అనుమతి అధికారం మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈమేరకు ఫిబ్రవరి 2న జీఓ ఎంఎస్ నెంబరు 20ను విడుదల చేసింది. దీన్ని అనుసరించి ప్రజలు సులభంగా స్వీయ అంగీకార ధ్రువీకరణ పత్రం అందజేసి భవననిర్మాణ అనుమతులు పొందడానికి వీలు కల్పించారు. ఈ విధానం ద్వారా బిల్డర్లకు బహుళ అంతస్తులను నిర్మించుకునే విషయంలో ఊరట కలిగింది. దీంతో నిర్మాణ రంగం ఊపందుకునే అవకాశం ఉన్నట్లు పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ఏకకాలంలో అనుమతులు

ఏకకాలంలో అనుమతులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో ఒకే పోర్టల్‌లో అన్ని అనుమతులు పొందే అవకాశం కలిగింది. గత ప్రభుత్వంలో బహుళ అంతస్తుల నిర్మాణాల అనుమతుల కోసం వేచి చూసే కార్యక్రమంతో పాటు లక్షల్లో డబ్బులు చెల్లించాల్సి వచ్చేది. దీంతో వైసీపీ ప్రభుత్వ పాలనలో నిర్మాణరంగం పూర్తిగా కుదేలైంది. ఈ సమస్యలను గుర్తించిన ప్రస్తుత మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ భవన నిర్మాణాలకు ఏకకాలంలో అనుమతుల మంజూరు చేసే విధానానికి శ్రీకారం చుట్టారు. భవన నిర్మాణ అనుమతులు స్థానికంగా ఉన్న మున్సిపల్ కమిషనర్ పరిధిలోనే జరుగుతుండటంతో బిల్డర్లకు వెసులుబాటు లభించింది. వారికి వ్యయప్రయాసలు తప్పాయి. దీంతో జిల్లాలోని ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, హిందూపురం వంటి మున్సిపాలిటీల్లో బహుళ అంతస్తుల భవననిర్మాణాలకు ఆన్‌లైన్‌లోనే అనుమతులు పొందే అవకాశం ఏర్పడింది. ఇందుకు సంబంధించి దరఖాస్తుదారులు స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని లైసెన్సుడు టెక్నికల్ సర్వేయర్, ఇంజనీర్‌కు ఆన్‌లైన్‌లోకాని నేరుగా కాని అందజేయవచ్చని పుట్టపర్తి మునిసిపల్ కమిషనర్ ప్రహ్లాద తెలిపారు.



ప్రహ్లాద, మున్సిపల్ కమిషనర్

ఎదురుచూపులు

ఎన్నాళ్లు..?


ఆర్భాటంగా బీసీ రుణాల మెగా చెక్కు విడుదల

20 రోజులు కావస్తున్నా...

లబ్ధిదారుల ఖాతాలకు జమకాని డబ్బు

విడుదల కాని బడ్జెట్

పొదుపు ఖాతాల ఫ్రీజ్‌తో ఇబ్బందులు



అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పలేదు. ఆర్భాటంగా రుణాల మెగా చెక్కు విడుదల చేసి, డబ్బు మాత్రం జమ చేయలేదని వారు వాపోయారు. కార్పొరేషన్ ద్వారా బీసీ వర్గాలకు సబ్సిడీ రుణాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ప్రక్రియ చేపట్టింది. అన్నీ అనుకున్నట్లుగానే దరఖాస్తులు చేసుకోవడం... వెరిఫికేషన్.. బ్యాంకర్లకు అందజేయడం... ఆర్భాటంగా ఈనెల 11వ తేదీన అదికూడా జ్యోతిబాపూలే జయంతి రోజున రూ.11.61 కోట్ల మెగాచెక్కును ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ వినోద్‌కుమార్ విడుదల చేశారు. ఇక రెండుమూడ్రోజుల్లో లబ్ధిదారుల ఖాతాలకు రుణం మొత్తం జమవుతుందన్న ప్రచారం జోరుగా సాగింది. సీన్ కట్ చేస్తే... మెగా చెక్కు విడుదల చేసి 20 రోజులవుతున్నా... జిల్లాలో ఒక్కరంటే ఒక్క లబ్ధిదారు డి కే రుణం అందిన దాఖలాలు లేవనే చెప్పాలి. దీంతో లబ్ధిదారులకు నిట్టూర్పు తప్పడం లేదు.

సేవింగ్స్ ఖాతాలు ఫ్రీజ్

బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల పంపిణీ ప్రక్రియకు సంబంధించి తతంగమంతా ముగిసిందనే చెప్పాలి. ఈ నేపథ్యంలోనే మెగా చెక్కు విడుదల అనంతరం దరఖాస్తులు ఆయా బ్యాంకర్లకు వెళ్లిపోయాయి. ఆయా బ్యాంకర్లు.. సిబిల్ స్కోరు తదితరాలను పరిశీలించి, లబ్ధిదారుల ఖాతాను ఫ్రీజ్ చేశారు. ఇక్కడే కొందరు బ్యాంకర్లు తప్పులే కాలేశారు. సబ్సిడీ రుణాలు విడుదల చేయాలంటే... లబ్ధిదారుడికి ఖాతా ఉన్న బ్యాంకులో రుణానికి మరో ఖాతా తెరిచేవారు. ఈసారి కొందరు బ్యాంకర్లు.. లబ్ధిదారుడికి ఉన్న ఒకే ఒక సేవింగ్స్ ఖాతాను ఫ్రీజ్ చేశారు. అందులోనూ సబ్సిడీ మొత్తాన్ని హోల్డ్ చేసి... మిగిలిన రుణం మొత్తాన్ని మైనస్‌లో చూపించేశారు. ఇదంతా బ్యాంకు సేఫ్టీ ప్రకారం చూసుకున్నారనప్పటికీ.. మైనస్‌లో చూపిస్తుండటంతో లబ్ధిదారులు బ్యాంకు లావాదేవీలు జరిపేందుకు వీలులేకుండా పోయిందనే చెప్పాలి. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. పైగా... మెగా చెక్కు విడుదలై 20 రోజులు కావస్తున్నా రుణాలు అందకపోవడం, మే నెల వస్తుండటంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. అకౌంట్‌లో మైనస్ చూపిస్తుండటంతో ఆ నెలలో ఈఎంఐలు కట్టుకునే వారి పరిస్థితి దయనీయంగా మారిందనే చెప్పాలి. దీనిపై పలువురు లబ్ధిదారులు.. బీసీ కార్పొరేషన్ అధికారుల వద్ద వాపోయినట్లు సమాచారం.

విడుదలకాని బడ్జెట్..?

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయకపోవడంతోనే బీసీ కార్పొరేషన్ రుణాలు పెండింగ్‌లో ఉన్నట్లు ఆ శాఖ ద్వారా అందిన సమాచారం. జ్యోతిబాపూలే జయంతి రోజున ఆర్భాటంగానే మెగా చెక్కు విడుదల చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఈ రుణాలకు సంబంధించి బడ్జెట్ రిలీజ్ చేయడంలో ఆలస్యం కావడమే ప్రధాన కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆ శాఖాధికారుల ద్వారా అందిన సమాచారం మేరకు... మే 15వ తేదీలోపుగానీ, మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

సమాచారం లేదు

లబ్ధిదారుల ఖాతాలకు రుణ మొత్తాలు జమయ్యే అంశం మా పరిధిలో లేదు. నిధులు విడుదలైతే లబ్ధిదారుల ఖాతాలకు డబ్బులు జమవుతాయి.

- సుబ్రహ్మణ్యం, ఈడీ, బీసీ కార్పొరేషన్





ఈనెల 11న కలెక్టర్, ఎంపీ ఆధ్వర్యంలో విడుదల చేసిన మెగాచెక్కు

అనంతకు వరం.. ఆర్డీటీ: గౌస్‌మొద్దీన్



అనంతపురం అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఆర్డీటీ ఒక వరమని గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గౌస్ మొద్దీన్ అన్నారు. నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. వెనుకబడిన జిల్లాలో 56 ఏళ్లుగా ఆర్డీటీ విద్య, వైద్య సేవలు అందిస్తోందని, పేదరిక నిర్మూలనకు కృషి చేస్తోందని అన్నారు. ఎంతో మంది క్రీడాకారులను తయారుచేసిన ఘనత ఆర్డీటీదని అన్నారు. బత్తలపల్లి, కళ్యాణదుర్గం, కణేకల్లు ప్రాంతాల్లో ఆస్పత్రుల ద్వారా పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందుతున్నాయని గుర్తు చేశారు. ఆర్డీటీ సహకారంతోనే తాను అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జిల్లాలో డిజిటల్ గ్రంథాలయాన్ని పూర్తి చేశామని అన్నారు. ఆర్డీటీకి వెంటనే ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయాలని, నిధులు అందేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారం అయ్యేలా చూస్తామని అన్నారు.

క్రమబద్ధీకరణపై సమాలోచనలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, అనుబంధ శాఖల్లో పనిచేస్తున్న సిబ్బంది క్రమబద్ధీకరణపై ఆయా శాఖల ఉన్నతాధికారులు సమాలోచనలు జరిపారు. జేడీఏ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, ఉద్యాన శాఖ డీడీ ఫిరోజ్ ఖాన్, సెరికల్చర్ డీడీ అంజనేయులు, జేడీఏ ఆఫీస్ టెక్నికల్ ఏఓ వెంకట్‌కుమార్, హెచ్ఓ రత్నకుమార్‌లు సిబ్బంది క్రమ బద్ధీకరణపై మంగళవారం సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాలోని 450 రైతు సేవా కేంద్రాల పరిధిల్లో 189 ఉద్యాన సహాయకులు, 123 మంది వ్యవసాయ సహాయకులు, 9 మంది పట్టు పరిశ్రమ సహాయకులు, 189 మంది ఎంపీఈఓలు పనిచేస్తున్నారు. క్లస్టర్ వారిగా ఆయా పరిధిల్లో ఏఏ రకాల పంటలు ఎక్కువగా సాగువుతున్నాయో ఆయా శాఖల సిబ్బందిని అక్కడ నియమించేందుకు జాబితాలు తయారు చేయాలని నిర్ణయించారు. క్రమబద్ధీకరణ తర్వాత సిబ్బంది బదిలీలు జరిగేలా రాష్ట్ర ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు.



చర్చిస్తున్న వ్యవసాయ, అనుబంధ శాఖల ఉన్నతాధికారులు

ఆర్డీటీకి అండగా ఉంటాం

ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం అర్బన్/కల్చరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి అండగా ఉంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఆ సంస్థ కార్యాలయంలో ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంఛో ఫెర్రర్‌ను మంగళవారం కలిశారు. విదేశీ నిధులు ఆగిపోయిన కారణంగా నిలిచిపోయే సేవల గురించి ఆరా తీశారు. ఆర్డీటీకి అండగా నిలవాలని ఇప్పటికే ఎమ్మెల్యేలందరం చర్చించుకున్నామని, త్వరలోనే సీఎం చంద్రబాబును కలుస్తామని ఆయనకు తెలిపారు. మే 2న ప్రధాన మంత్రి రాష్ట్రానికి వస్తున్నారని, ఆయన దృష్టికి ఆర్డీటీ అంశాన్ని తీసుకువెళతామని అన్నారు.



మాంచో ఫెర్రర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

సేవ్ ఆర్డీటీ..

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ అయ్యేలా సహకరించాలని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను సేవ్ ఆర్డీటీ కమిటీ సభ్యులు కోరారు. టీడీపీ అర్బన్ కార్యాలయంలో కమిటీ సభ్యులు షకీల్ షఫి, సీపీఎం నాయకుడు రాంభూపాల్, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కాంగ్రెస్ నాయకుడు దాదాగాంధీ తదితరులు ఎమ్మెల్యేని కలిసి వినతి పత్రం సమర్పించారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పదించారు. సీఎం, ప్రధాని దృష్టికి తీసుకువెళతామని, అవసరమైతే తానే ఢిల్లీకి వెళతానని అన్నారు.

ఆర్డీటీ కోసం ఉద్యమిద్దాం: జేసీ ప్రభాకర్ రెడ్డి



ఆర్డీటీని బతికించుకుందామంటూ ప్రదర్శన చేస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ కోసం పార్టీలకు అతీతంగా కలిసి ఉద్యమిద్దామని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కలెక్టరేట్ కూడలి వద్ద మంగళవారం టీడీపీ నాయకులతో కలిసి ప్రదర్శన చేశారు. విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి ఆర్డీటీ కార్యాలయానికి చేరుకొని మాంఛో ఫెర్రర్‌ను కలిసి మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కరువు జిల్లా ప్రజలకు ఆర్డీటీ అనేక సేవలు అందిస్తోందని అన్నారు. కొవిడ్ సమయంలో ఆర్డీటీ అందించిన వైద్య సేవలు ఎవరూ మర్చిపోలేరని అన్నారు.ప్రభుత్వం చేయలేని పనులు కూడా ఆర్డీటీ సంస్థ చేస్తోందన్నారు. ఆర్డీటీ కోసం పార్టీలకు అతీతంగా నాయకులంతా కలిసి రావాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ అంశం కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉందని, సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి ఆర్డీటీని బతికించుకుందామన్నారు.

ఎట్టకేలకు పట్టారు..!

అక్రమ పట్టాల రద్దుకు రంగం సిద్ధం

37మంది అనర్హులకు నోటీసులు జారీ

సంజాయిషీ కోసం నేడు ఆర్డీఓ వద్దకు..

కుణుతూరు జగనన్న లేఅవుట్‌లో అక్రమాల తతంగం



ధర్మవరంరూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కుణుతూరు జగనన్న లేఅవుట్‌లో అనర్హుల పట్టాల రద్దుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. గత ప్రభుత్వంలో కొందరు వైసీపీ నాయకులు, కార్యకర్తలు అక్రమంగా పట్టాలు పొందారు. అయితే ప్రస్తుత ప్రభుత్వ విచారణలో వారంతా అనర్హులని తేలింది. దీంతో అనర్హుల జాబితాను సిద్ధం చేసి వారి పట్టాలను రద్దు చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈక్రమంలోనే వారి పట్టాల రద్దుకు నోటీసులు జారీచేశారు. ఆర్డీఓ వద్ద సంజాయిషీ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు.

167 మందికి పట్టాల పంపిణీ

ధర్మవరం మండలంలోని కుణుతూరు పంచాయతీలో 167మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. మామిళ్లపల్లి-ధర్మవరం ప్రధాన రహదారికి ఆనుకుని పట్టాలు పంపిణీ చేశారు. వీటి విలువ రూ.లక్షలు ఉండటంతో కొందరు వైసీపీ నాయకులు తమ అనుచరులు, పార్టీకోసం పనిచేసిన వారికి అప్పనంగా కట్టబెట్టారు. కుణుతూరు జగనన్న లేఅవుట్ వేసి పట్టాలు పంపిణీ చేశారు. ఇందుకుగాను కుణుతూరు పొలంలో సర్వేనెంబర్ 382-1, 387-1, 388-1, 389-1, 406-4బీలో స్థలాలు కేటాయించారు. ముందుగా ఈ లేఅవుట్‌లో అప్పటి ఎమ్మెల్యే చేతుల మీదుగా 30మందికి ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. మిగిలిన పట్టాలను ఆ పంచాయతీ ప్రధాన వైసీపీ నాయకుల కనుసన్నల్లో పంపిణీ చేశారు. అయితే కొత్త ప్రభుత్వం రాగానే జగనన్న లేఅవుట్‌లోని అనర్హులను గుర్తించాలని అధికారులను ఆదేశించింది. ఈ లేఅవుట్‌లో అనర్హులకు పట్టాలు పంపిణీ చేశారని, 2021లో అదే గ్రామానికి చెందిన గొడ్డుమర్రి వెంకటేష్ లోకాయుక్తను ఆశ్రయించారు. వివాదం కోర్టులో ఉన్నప్పటికి హౌసింగ్ అధికారులు మాత్రం లబ్ధిదారులతో కుమ్మక్కై బిల్లులు కూడా మంజూరు చేసినట్లు తెలుస్తోంది.

37మందికి నోటీసులు

కుణుతూరు జగనన్న లేఅవుట్‌లో 37మందిని మాత్రమే అనర్హులుగా గుర్తించారు. వారి పట్టాలు రద్దు చేసేందుకు ఆర్డీఓ కార్యాలయ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈనెల 30న విచారణకు రావాలని నోటీసులో పేర్కొన్నారు. విచారణకు రాకపోతే పట్టాలు రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే పట్టాలు పొందిన వారిలో ఇంకా చాలామంది అనర్హులు ఉన్నారని, వారికెందుకు నోటీసులు ఇవ్వలేదని అదే గ్రామస్థులే అధికారులు వద్ద ఆగ్రహం వ్యక్తం చేశారు. నిష్పక్షపాతంగా అధికారులు విచారణ చేసి అనర్హులను పూర్తిగా తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విచారణకు వస్తారా.. డుమ్మా కొడతారా?

అనర్హులుగా తేల్చిన 37మందిలో సుమారు 33మంది దాకా నోటీసులు తీసుకున్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. వీరంతా విచారణకు హాజరవుతారా లేక డుమ్మా కొడతారా అనేది వేచిచూడాలి. నోటీసులు తీసుకున్న వారు 'మేము ఇళ్లు కట్టుకున్నాం. ఎవరేమి చేస్తారు? విచారణకు మా నాయకులు చెబితే పోతాం. లేదంటే లేదు. ఏమైనా చేయనీలే. మా ప్రభుత్వం మళ్లీ రాదా' అంటున్నట్లు సమాచారం. విచారణకు వెళ్లకపోతే పట్టాలు రద్దు చేస్తే ఎలా అంటూ మరికొంతమంది సందిగ్ధంలో పడ్డారు.



అనర్హుల ఇళ్లపట్టాలు రద్దుచేసేందుకు రెవెన్యూ అధికారులు జారీచేసిన నోటీసులు

నోటీసులు తీసుకునేందుకు వైసీపీ నాయకులు ససేమిరా..?

కుణుతూరు పంచాయతీలోని కుణుతూరు, కట్టకిందపల్లి, కామిరెడ్డిపల్లి గ్రామాలు వస్తాయి. ఈ గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలే అప్పట్లో పట్టాలు పొందారు. కుణుతూరు, కామిరెడ్డిపల్లిలోని ఆగ్రామ వైసీపీ నాయకుల పేరు మీద పట్టాలు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించి వారికి నోటీసులు జారీచేశారు. నోటీసులు తీసుకుని రెవెన్యూ అధికారులు ఆ నాయకుల ఇళ్ల వద్దకు వెళితే మీరు ఇచ్చే నోటీసులు తీసుకోం అనడంతో దిక్కుతోచక ఆ గ్రామస్థాయి సిబ్బంది వెనుతిరిగినట్లు సమాచారం. పొజిషన్ పట్టాలు పొందినట్లు రికార్డుల్లో పేర్లు ఉన్నాయని చెప్పినా వినకుండా వెనక్కు పంపినట్లు సమాచారం.

పట్టాల రద్దుకు చర్యలు

ఇళ్ల పట్టాలు పొందిన వారిలో 37మందిని అనర్హులుగా గుర్తించి, నోటీసులు జారీచేశాం. వారిని ఈనెల 30న విచారణకు రావాలని నోటీసులో తెలిపాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనర్హులు పట్టాలు తీసుకున్నట్లు తేలింది. వీరంతా ఆధారాలతో విచారణకు వచ్చి సంజాయిషీ ఇచ్చుకోవాలి. లేనిపక్షంలో వీరందరి ఇంటి పట్టాలు రద్దుకు తగు చర్యలు తీసుకుంటాం.



మహేష్, ఆర్డీఓ, ధర్మవరం

ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణ స్వామి తెలిపారు. జిల్లాలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రైతులు చెట్ల కింద నిలబడరాదన్నారు. పశువులు, గొర్రెల మేకలను చెట్ల కింద ఉంచరాదని సూచించారు. ఉమ్మడి జిల్లాలో వాతావరణ ఆధారిత వ్యవసాయ సూచనలు రైతులు పాటించాలని సూచించారు. ప్రస్తుతం నమోదైన వర్షాలను వినియోగించుకుని వేసవి దుక్కులు చేసుకోవాన్నారు. వీటి వలన ఎంతో మేలు జరుగుతుందన్నారు. పండ్ల తోటల్లో వేసవి కాలంలో గుంతలు తీసి ఎండనివ్వాలని సూచించారు. దీని వలన నేలలో ఉన్న పురుగులు, వాటి గుడ్లు, తెగుళ్లను కలిగించే శిలింధ్రాలు నశిస్తాయన్నారు.

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రద్దీని నియంత్రించడానికి చర్లపల్లి-తిరుపతి మధ్య (వయా గుంతకల్లు) ప్రత్యేక రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. చర్లపల్లి-తిరుపతి ప్రత్యేక వీక్లీ రైలు (నం.07257) మే 8వ తేదీ నుంచి వరుసగా నాలుగు గురువారాల్లో నడపనున్నట్లు తెలియజేశారు. ఈ రైలు చర్లపల్లిలో మే 8వ తేదీ నుంచి 29వ తేదీ వరకూ గురువారాల్లో సాయంత్రం నాలుగున్నరకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.40 గంటలకు తిరుపతికి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07258) మే 9 నుంచి 30వతేదీ వరకూ వరుసగా నాలుగు శుక్రవారాల్లో మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి మరునటిరోజు తెల్లవారుజామున నాలుగున్నరకు చర్లపల్లికి చేరుతుందన్నారు. ఈ రైలు సనత్‌నగర్, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, సేడం, యాదగిరి, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, కోడూరు, రేణిగుంట స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

అమృత్ స్టేషన్ల తనిఖీ



కదిరి రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్‌లోని కదిరి, మదనపల్లి రోడ్, పీలేరు రైల్వే స్టేషన్లలో నిర్మాణ పనులను డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా మంగళవారం తనిఖీచేశారు. అమృత్ స్టేషన్ల కింద ఎంపికైన ఈ స్టేషన్లను డీఆర్ఎం సందర్శించి పనితీరును పరిశీలించారు. జరుగుతున్న పనులకు సంబంధించి బ్రాంచ్ అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో కన్‌స్ట్రక్షన్, మెకానికల్ ఇంజనీరింగ్ అధికారులు, రైల్వే స్టేషన్ల అధికారులు పాల్గొన్నారు.

సర్క్యులర్ 1/2019ను అమలు చేయాలి

ఎన్ఎంయూఏ జిల్లా చైర్మన్ సూరిబాబు




రిలే దీక్షలు చేస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రతనిచ్చే 1/2019 సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని ఎన్ఎంయూఏ జిల్లా చైర్మన్ సూరిబాబు డిమాండ్ చేశారు. ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో అనంతపురం బస్టాండు ఆవరణలో సోమవారం నుంచి నిర్వహిస్తున్న రిలే దీక్షలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బంది తప్పులు చేస్తే వారిపై తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి 2019లో అప్పటి ఎండీ సురేంద్రబాబు అధికారులు, కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరిపి, 1/2019 సర్క్యులర్‌ను తీసుకొచ్చారన్నారు. పనిష్మెంట్ల విషయంలో అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలను సర్క్యులర్ ద్వారా అమలులోకి తెచ్చారని తెలిపారు. అయితే 2020లో ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయ్యాక ఈ సర్క్యులర్‌ను పక్కన పెట్టేశారని తెలిపారు. దీంతో సిబ్బందిపై ఇష్టారాజ్యంగా చర్యలు తీసుకోసాగారన్నారు. కూటమి ప్రభుత్వమైనా తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్లను వెంటనే ఇవ్వడంతోపాటు గ్యారేజీల్లో ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ జిల్లా నాయకుడు పుల్లయ్య, డిపో కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు రాము, రమణ, ఓబయ్య, కేజీ ప్రసాద్, హేమలత, అనసూయమ్మ, సర్వాణి తదితరులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22,670 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 830 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

● బహుదూరపు బాటసారి..!



సాయంత్రం 6.26 గంటలకు ఎర్రటి బంతిలా మెరుస్తున్న సూర్యుడు

ఉదయ భానుడిగా
వెలుగులు పంచి...
మధ్యాహ్న మార్తాండుడిగా
ప్రకాశం అందించి...
సాయంకాల సమయాన
ప్రకృతి ప్రేమికులను
అలరిస్తూ
మరో తూరుపున ఉదయం కోసం
మా పడమటి కొండలు, తరువుల
మాటుకు వెళుతున్న సూరయ్యా..!
నీ ఒంటరి పయనం జగతికి ఆదర్శం

(ఈ చిత్రం చిలమత్తూరు మండలం దేమకేతిపల్లి సమీపంలో మంగళవారం 'ఆంధ్రజ్యోతి' కంటబడింది)

- ఆంధ్రజ్యోతి, హిందూపురం

మిర్చి వెలవెల..!

- పాతాళానికి ఎండుమిరప ధరలు
- కొనేవారు కరువు
- మార్కెట్‌యార్డు, పొలాల్లోనే దిగుబడులు
- అయోమయంలో అన్నదాతలు



మార్కెట్‌యార్డులో నిల్వచేసిన మిరప రాశులు

ఉరవకొండ, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం శ్రమించి, లక్షలు పెట్టుబడులు పెట్టి పండించిన పంటలు అన్నదాతల పాలిట కన్నీటి రాశులుగా మారుతున్నాయి. అన్నదాత కష్టానికి విలువ లేకుండా పోతోంది. ఎండు మిరప ధరలు అమాంతం పడిపోవడంతో కొనేవారులేక మార్కెట్‌యార్డు, పొలాల్లోనే రైతులు రాశులుగా పోసుకున్నారు. ఎక్కడ అమ్ముకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. రెండేళ్ల నుంచి మిరప ధరలు దారుణంగా పడిపోయాయి. నియోజకవర్గంలో హెచ్చెల్సీ, జీబీసీ, హంద్రీనీవా కాలువతోపాటు, బోరుబావుల కింద 20వేల ఎకరాలకుపైగా మిర్చి సాగుచేశారు. జిల్లావ్యాప్తంగా 45 వేల ఎకరాల్లో మిరప పంట పెట్టారు. వీటిలో బ్యాడిగ, డబ్బీ, 2043, తేజ, 5531 రకాలను వేశారు. ఎకరాకు రూ.2 లక్షలదాకా పెట్టుబడులు పెట్టారు. బ్యాడిగ, డబ్బీ రకాలు క్వింటా ధర ఫిబ్రవరిదాకా రూ.38 వేలు పలికాయి. ప్రస్తుతం రూ.20 వేలకు పడిపోయింది. ఈసారి జిల్లావ్యాప్తంగా సుమారు 7 లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. గతేడాది లక్షల క్వింటాళ్లదాకా స్టోరేజీల్లో నిల్వలున్నాయి. విత్తన రకాల మిరప పంట ధరలు రూ.8 వేలు దాటడం లేదు. ఉన్న రేటుకే అమ్ముదామంటే కొనేవారే కరువయ్యారని రైతులు వాపోతున్నారు. మిరప కోతలు పూర్తయి నెలరోజులైంది. వాటిని నిల్వ చేసుకునేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. దీంతో పొలాల్లోనే, చెట్ల కిందే నిల్వ చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మరికొంతమంది రైతులు కర్ణాటకలోని బ్యాడిగ, ఇతర ప్రాంతాల్లోని శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. బస్తాకు రూ.150దాకా రవాణా, నిల్వ చేసినందుకు రూ.250 అద్దె చెల్లించాల్సి వస్తోంది. ఇది రైతులకు అదనపు భారం కానుంది.

ఫిబ్రవరి దాకా బాగున్నా..

ఫిబ్రవరి దాకా డబ్బీ, కడ్డీ రకం మిరప ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి. పంట చేతికి రాగానే అమాంతం పడిపోయాయి. దీంతో ఈసారీ మిర్చి రైతుకు నష్టాలు తప్పలేదు. స్థానికంగా శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

గత మూడేళ్లలో మిరప ధరలు ఇలా..

రకం	2023	2024	2025
కడ్డీ	రూ.60-65వేలు	రూ.50-55వేలు	రూ.14-20వేలు
డబ్బీ	రూ.65-70వేలు	రూ.45-50వేలు	రూ.20వేలు
5531	రూ.20-25వేలు	రూ.20-25వేలు	రూ.8-10వేలు
2043	రూ.30-40వేలు	రూ.30-40వేలు	రూ.5-8వేలు

నష్టానికే అమ్ముకోవాల్సి వస్తోంది



రెండేళ్లుగా మిరప ధరలు పడిపోయాయి. నష్టానికే అమ్ముకోవాల్సి వస్తోంది. మూడు ఎకరాల్లో పంట సాగు చేశా. 16 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. రూ.12వేలకు కూడా డబ్బీరకం మిరప అడిగేవారు లేరు. స్థానికంగా శీతల గిడ్డంగులు ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది.

- భీమప్ప, రైతు, ఉరవకొండ

కొనేవారే లేరు



మూడెకరాల్లో మిరప సాగుచేశా. వర్షానికి తెగుళ్ల సోకి పంట దిగుబడి తగ్గిపోయింది. 7 క్వింటాళ్లే వచ్చింది. అదికాస్త అమ్ముదామనుకుంటే కొనేవారు లేరు. గత్యంతరంలేక మార్కెట్లో రూ.18 వేలకే క్వింటా చొప్పున అమ్మేశా.

- వెంకోబరావు, రైతు, ఉరవకొండ

అమరావతి కేంద్రంగా ఏపీజీబీ

నాలుగు గ్రామీణ బ్యాంకుల విలీనం పూర్తి

రేపటి నుంచి అమలు: ఆర్ఎం శ్రీదేవి

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి కేంద్రంగా ఏపీజీబీ(ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు) ప్రధాన కార్యాలయం పనిచేస్తుందని ఆ బ్యాంకు ఆర్ఎం శ్రీదేవి తెలిపారు. నాలుగు గ్రామీణ బ్యాంకుల విలీనానికి సంబంధించి మంగళవారం స్థానిక అంబేడ్కర్‌రోడ్డులోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎం శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకులు నాలుగింటిని కలిపి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేశారని తెలిపారు. మొత్తం 1351బ్రాంచ్‌లు, 7వేల మంది ఉద్యోగులు, రూ.1.23లక్షల కోట్ల టర్నోవర్‌తో దేశంలోనే రెండో అతిపెద్ద బ్యాంకుగా అవతరించిందన్నారు. నాలుగు బ్యాంకుల విలీనంతో ఖాతాదారులకు ఎటువంటి నష్టం ఉండదని, ఖాతా నంబర్లు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్, బ్రాంచ్ చిరునామాలలో ఎటువంటి మార్పులు ఉండవని తెలిపారు. బ్యాంకు విలీనంతో ఖాతాదారులకు మరింత మెరుగైన, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సేవలు చేరువచేస్తామన్నారు. మే 1వతేదీ నుంచి బ్యాంకుల విలీనం వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సీనియర్ మేనేజర్లు చైతన్యకుమార్, శ్రీధర్, శివకుమార్, శేషసాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీదేవి

జేఎన్టీయూ స్నాతకోత్సవానికి గవర్నర్: వీసీ

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ 14వ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ హాజరు కానున్నట్లు వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు తెలిపారు. జేఎన్టీయూలో ఈసెట్-2025 నిర్వహణపై మంగళవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ.. మే 17న స్నాతకోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. 7వేల మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తామన్నారు. గవర్నర్‌తో పాటు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హాజరయ్యే అవకాశాలున్నాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య, డైరెక్టర్ ప్రొఫెసర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

పరీక్షలు రాయనున్న 14,221 మంది విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలకోసం బుధవారం నిర్వహిస్తున్న పాలిసెట్‌కు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను సంబంధిత అధికారులు పూర్తిచేశారు. కోఆర్డినేటర్లు జయచంద్రారెడ్డి, సురేష్‌బాబు పరీక్షా కేంద్రాలను సందర్శించి, అధికారులను సమన్వయం చేశారు. వారు మాట్లాడుతూ.. ఉదయం 11 గంటలకు పరీక్షలు ప్రారంభమౌతాయన్నారు. 10 గంటలనుంచే పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తారని తెలిపారు. రవాణా సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని 9గంటలకే పరీక్షా కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలని సూచించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 37 పరీక్షా కేంద్రాల్లో 14,221మంది పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన రెండు కేంద్రాలను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి, భార్యకు గాయాలు

తాడిపత్రి, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగనూరు సమీపాన మంగళవారం ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టడంతో నరసింహులు (59) మృతిచెందగా.. అతడి భార్య వరలక్ష్మి గాయపడ్డారు. రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సజ్జలదిన్నె గ్రామానికి చెందిన నరసింహులు, అతడి భార్య వరలక్ష్మి బైక్‌లో కడపజిల్లా కొండాపురం మండలానికి బయల్దేరారు. వంగనూరు సమీపంలో లారీ ఢీకొట్టడంతో నరసింహులు, వరలక్ష్మికి గాయాలయ్యాయి. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. నరసింహులు చికిత్స పొందుతూ మృతిచెందాడు. వరలక్ష్మికి స్వల్పగాయాలయ్యాయి. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బీపీఈడీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈడీ) పరీక్షా ఫలితాలను మంగళవారం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అనిత విడుదల చేశారు. వీసీ మాట్లాడుతూ.. ద్వితీయ సెమిస్టర్ పరీక్షలకు 74మంది హాజరుకాగా.. 47మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్, న్యాయవిద్య విభాగాధిపతి డాక్టర్ శ్రీరాములు పాల్గొన్నారు.

రేపట్నుంచి వేసవి శిబిరాలు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వేసవి క్రీడాశిక్షణా శిబిరాలు మే ఒకటో తేదీ నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) ఉదయ్‌భాస్కర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆయా వేదికల వివరాలను ఆయన వెల్లడించారు. వివరాలకు 9849421462 నంబరులో సంప్రదించాలని కోరారు.

క్రీడాంశం	శిబిరం నిర్వహించే వేదికలు
అథ్లెటిక్స్	అనంతపురం, పామిడి, గుంతకల్లు
ఆర్చరీ	విద్యారణ్య స్కూల్, ఆన్‌సెట్ ఆఫీస్
బాస్కెట్‌బాల్	డీఎస్ఏ ఇండోర్‌స్టేడియం, నీలం సంజీవరెడ్డి స్టేడియం, ఉరవకొండ
ఫుట్‌బాల్	అనంతపురం ఆర్ట్స్ కాలేజీ
ఫెన్సింగ్	కళ్యాణదుర్గం, సేతు స్కూల్, ఇండోర్ స్టేడియం, విద్యారణ్య స్కూల్ (అనంతపురం),
హ్యాండ్‌బాల్	కళ్యాణదుర్గం కేవీకే, చాపిరి
హాకీ	కళ్యాణదుర్గం, అనంతపురం ఆర్ట్స్ కాలేజీ
జూడో	అనంతపురం, కళ్యాణదుర్గం, గుత్తి, గార్లదిన్నె, తాడిపత్రి
కబడ్డీ	నీలం సంజీవరెడ్డి స్టేడియం, ఎస్ఎస్‌బీఎన్, తాడిపత్రి, యాడికి, గుంతకల్లు
కర్రసాము	ఆర్ట్స్ కళాశాల
ఖో-ఖో	రాప్తాడు, రాయదుర్గం,
సెపక్‌తక్రా	ఉరవకొండ
స్విమ్మింగ్	అనంతపురం
టేబుల్ టెన్నిస్	ఉరవకొండ
తైక్వాండో	పామిడి, రాజీవ్‌చిల్డ్రన్స్ పార్కు, నీరుప్రగతి పార్కు, వివేకానంద పార్కు, ఎంబీ తైక్వాండో అకాడమీ, లక్ష్మిస్కూల్, రెయిన్‌బో స్కూల్
వాలీబాల్	నీలం సంజీవరెడ్డి స్టేడియం, ఉరవకొండ, తాటిచెర్ల, శింగనమల తరిమెల, నార్ప
రైఫిల్ షూటింగ్	విద్యారణ్య స్కూల్
రెజ్లింగ్	పామిడి, కళ్యాణదుర్గం
బ్యాడ్మింటన్	అనంతపురం
వెయిట్‌లిఫ్టింగ్	తాటిచెర్ల

ట్యాంకర్ డ్రైవర్ ఆత్మహత్య

హిందూపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూమకుంట చెక్‌పోస్టుకు చెందిన ట్యాంకర్ డ్రైవర్ రాజు(40) సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్‌గ్రేడ్ స్టేషన్ ఎస్ఐ మునిప్రతాప్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం రాత్రి రాజు, అతడి భార్య నిర్మల, పిల్లలు కలిసి మేడపై పడుకున్నారు. వర్షం కురవడంతో భార్యాపిల్లలు ఇంట్లోకి వెళ్లిపోయారు. అక్కడే పడుకున్న రాజు అర్ధరాత్రి దాటాక సిమెంటు దిమ్మెకు ఉన్న ఇనుపకడ్డీలకు లుంగీతో ఉరేసుకున్నాడు. ఉదయం రాజు ఎంతసేపటికీ కిందకు రాకపోవడంతో భార్యాపిల్లలు వెళ్లిచూశారు. సిమెంటు దిమ్మెకు వేలాడుతూ కనిపించాడు. కిందకు దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. అప్‌గ్రేడ్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. కొంతకాలంగా రాజు వ్యసనాలకు బానిసయ్యాడని పోలీసులు తెలిపారు. కుటుంబ కలహాలు కూడా ఉన్నట్లు భావిస్తున్నారు. ఆత్మహత్యపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అప్పుల బాధతో ఆటో డ్రైవర్..

బ్రహ్మసముద్రం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండిగానిపల్లికి చెందిన ఆటో డ్రైవర్ యల్లప్ప (40) అప్పుల బాధ భరించలేక మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. యల్లప్ప కుటుంబ ఖర్చులకు బయట అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలోనని తీవ్ర ఆవేదనకు లోనయ్యాడు. ఈ నేపథ్యంలో తన ఇంటిలోనే ఉరేసుకుని, మరణించినట్లు పోలీసులు, బంధువులు తెలిపారు. యల్లప్పకు భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. బ్రహ్మసముద్రం పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కౌలురైతు...



తలారి జయరాములు (ఫైల్)

బెళుగుప్ప, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గంగవరంలో కౌలు రైతు తలారి జయరాములు(54) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. పదేళ్ల నుంచి మామిడితోటలను కౌలుకు తీసుకుని జీవనోపాధి పొందేవాడు. ఈ యేడాది 12 ఎకరాలను కౌలుకు తీసుకోగా, ఆశించినంత దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయాడు. అప్పులు రూ.10 లక్షలకుపైగా పేరుకుపోయాయి. దిక్కుతోచనిస్థితిలో తోటలో సోమవారం రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందకనే ప్రాణాలు కోల్పోయాడు. జయరాములకు భార్య శారద, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శివ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో టీవీ మెకానిక్ మృతి

శింగనమల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సి.బండమీదపల్లి వద్ద బైక్‌ను వెనుకనుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన వెళ్లిపోయిన ప్రమాదంలో టీవీ మెకానిక్ వెంకట్రామిరెడ్డి(44) మృతిచెందాడు. ఎస్ఐ విజయ్‌కూమార్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దపప్పూరుకు చెందిన వెంకట్రామిరెడ్డి కుమారుడు బుక్కరాయసముద్రం మండలంలోని ఎస్ఆర్ఐటీ కాలేజ్ పక్కనున్న అనాథాశ్రమంలో పనిచేస్తున్నాడు. కుమారుడిని చూడడానికి వెంకట్రామిరెడ్డి ద్విచక్రవాహనంలో బయల్దేరాడు. సి.బండమీదపల్లి సమీపాన వెంకట్రామిరెడ్డి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన వెంకట్రామిరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. అతడికి భార్య, ఇద్దరు కూమారులు ఉన్నారు. శింగనమల ఎస్ఐ విజయ్‌కూమార్ కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

అనంతపురంటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తామని రజక ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్రిస్వామి, కార్యదర్శి ఆనంద్ తెలిపారు. జిల్లా కార్యాలయంలో ఈప్రతిభా పురస్కారాల విషయంగా మంగళవారం సమావేశమై చర్చించారు. వారు మాట్లాడుతూ పదో తరగతిలో 450కి పైగా, ఇంటర్‌లో 650కిపైగా మార్కులు సాధించిన రజక విద్యార్థులు ఈపురస్కారాలకు అర్హులన్నారు. బయోడేటా, మార్కులజాబితాను దరఖాస్తుకు జతపరిచి మే 20లోపు టీచర్ ఎర్రిస్వామి, డోర్‌నెంబర్ 1-1284, ఆర్‌కేనగర్, అనంతపురం చిరునామాకు పంపాలన్నారు. పురస్కారాల పంపిణీకి రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రమ్మ, డైరెక్టర్లు పరమేశ్వర్, రామాంజినేయులు అతిథులుగా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో రజక ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు గోపాల్, రామచంద్ర, రాజశేఖర్, రామయ్య, నాగేంద్ర, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని లిఫ్ట్‌లు

- ఉన్న ఎనిమిదీ నిరుపయోగంగానే..
- సూపర్‌స్పెషాలిటీలో దారుణ పరిస్థితి
- ఇబ్బందులు పడుతున్న రోగులు


సూపర్ స్పెషాలిటీలో మరమ్మతులకు వచ్చిన లిఫ్ట్‌లు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాకు తలమానికం అని చెప్పుకునే సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పరిస్థితి పేరుగొప్ప ఊరుదిబ్బ అన్న సామెతలా ఉంది. ఇక్కడ అధునాతన వైద్యం ప్రజలకు అందుతోంది. గుండె, న్యూరో, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు డాక్టర్లు ఆపరేషన్లు చేసి ప్రాణాలు కాపాడుతున్నారు. అలాంటి ఆస్పత్రిలో నిర్వహణ తీరు అందరినీ కలిచివేస్తోంది. ఈఆస్పత్రిలో ఎనిమిది లిఫ్ట్‌లు ఉన్నాయి. వీటి ద్వారానే రోగులు పైఅంతస్థులకు వెళాల్సి ఉంటుంది. కానీ ఒక్క లిఫ్ట్ కూడా ఇక్కడ పనిచేయడంలేదు. రెండు రోజులుగా ఆస్పత్రికి వచ్చిన రోగులు పైఅంతస్థులకు వెళ్లాలంటే అనేక ఇబ్బందులు, అవస్థలు పడడం కనిపించింది. సాధారణంగా ఇక్కడకు న్యూరో, గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధుల బాధితులే వస్తుంటారు. వయసు పైబడి అలాంటి రోగాలతో బాధపడుతున్న రోగులు కనీసం నడవడానికి కూడా ఇబ్బంది పడుతుంటారు. అలాంటపుడు మెట్ల వెంట పైఅంతస్థులకు వెళ్లాలంటే ఎంత అవస్థలు పడాల్సి వస్తుందో చెప్పనవసరం లేదు. రూ. 150 కోట్లు వెచ్చించి నిర్మించిన సూపర్ స్పెషాలిటీలో లిఫ్ట్‌లు పనిచేయకపోతే మరమ్మతులు చేయించడానికి కూడా డబ్బులు లేవంటే ఇక్కడ ఎంతటిదుర్భర పరిస్థితులు ఉన్నాయో అర్థమవుతోంది. పాలకులు, అధికారులు ఈ ఆస్పత్రి పట్ల దృష్టిపెట్టాలి. సమస్యలు పరిష్కరించి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి గౌరవం పెంచాల్సిన అవసరం ఉంది.

లిఫ్ట్‌లు ఏవీ పనిచేయడం లేదు

సూపర్‌స్పెషాలిటీలో మొత్తం ఎనిమిది లిఫ్ట్‌లు ఉన్నాయి. ఇక్కడ మెయింటెనెన్స్ సరిగా లేకపోవడంతో చాలారోజులుగా ఏడు లిఫ్ట్‌లు పనిచేయడంలేదు, ఒకటి మాత్రమే పనిచేస్తుండేది. అందరూ దానిని వినియోగించుకునేవారు. అది కూడా నాలుగైదు రోజులుగా చెడిపోయి పనిచేయడం లేదు. జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు తెలియజేశాం. అక్కడి నుంచే మాకు నిధులు రావాల్సి ఉంటుంది. మెకానిక్‌ను రమ్మన్నాం. నేడో రేపో అన్ని లిఫ్ట్‌లు మరమ్మతులు చేయిస్తాం.

- డాక్టర్ బెనిడిహట్ట,
డిప్యూటీ సూపరింటెండెంట్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

పిల్లల ఆరోగ్యంతో చెలగాటం ఆడకండి

- కుళ్లిన, సైజులేని గుడ్ల సరఫరాపై ఎమ్మెల్యే ఆగ్రహం


అంగన్‌వాడీ కేంద్రంలో చిక్కీలను, గుడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు కుళ్లిన, సైజులేని కోడి గుడ్లను సరఫరా చేయడంపై ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం స్థానిక రహ్మత్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడున్న గుడ్లు, చిక్కీలను పరిశీలించారు. సైజులేని గుడ్లతో పాటు కుళ్లి పోయిన గుడ్లు బయటపడ్డాయి. అలాగే చిక్కీలు నాణ్యంగా లేకపోవడంపై ఆయన మండిపడ్డారు. పిల్లల ఆరోగ్యంతో చెలగాటం ఆడతారా..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిపై ఉన్నతాధికారులు విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల హాజరు నమోదు చేయకపోవడాన్ని ఎమ్మెల్యే గమనించారు. ఎందుకింత నిర్లక్ష్యంగా ఉన్నారంటూ అక్కడి సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం : స్థానిక సాయినగర్ మొదటి క్రాస్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ప్రారంభించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని నాలుగు వేల మందికి ఉచితంగా కుట్టుపై శిక్షణ ఇవ్వ నున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


నగరంలో శాంతిర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, ముస్లింలు


నార్పలలో ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

'ఉగ్రమూకలను కఠినంగా శిక్షించాలి'

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై దాడికి పాల్పడిన ఉగ్రమూకలను కఠినంగా శిక్షించాలని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి పేర్కొన్నారు. ఉగ్రదాడిని నిరసిస్తూ, మృతులకు సంతాపంగా మంగళవారం సాయంత్రం సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో 49వ డివిజన్‌లోని ఇందిరానగర్‌లో కొవ్వొత్తులతో శాంతిర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఆవాజ్ వలి, ప్రకాష్, చంద్రిక, అశ్విని, రహంతుల్లా, సిద్దికి, ఇంతియాజ్, హసీబ్, సాలెహా, ఖాసీం, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

● నార్పల: పహల్గామ్ ఉగ్రదాడులను ఖండిస్తూ మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ముస్లింలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అమాయక ప్రజల ప్రాణాలు తీస్తున్న ఉగ్రవాదులను ఎక్కడికక్కడ మట్టుపెట్టాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

బాలాజీ ఫార్మసీకి న్యాక్ ఏ-గ్రేడ్


పల్లె కిశోర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న ఫార్మసీ ప్రిన్సిపాల్ తదితరులు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బాలాజీ విద్యాసంస్థల్లోని బాలాజీ ఫార్మసీ కళాశాలకు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్(ఎన్ఏఏసీ) ఏ-గ్రేడ్ దక్కింది. మంగళవారం మండలంలోని ఆలమూరు రోడ్డులోని పీవీకేకే విద్యాలయంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, ఇతర అధ్యాపక బృందం విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్, కోశాధికారి పల్లె సింధూరరెడ్డిని కలసి శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్ మాట్లాడుతూ... అత్యుత్తమ శిక్షణా ప్రమాణాలు, పరిశోధనలపై మక్కువ, శాస్త్రీయ అభ్యాసాన్ని ప్రోత్సహించే వాతావరణం వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సనపలో ఘనంగా ఊరిదేవర

ఆత్మకూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సనపగ్రామంలో 35 ఏళ్ల తరువాత మంగళవారం ఊరి దేవరను వైభవంగా నిర్వహించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామస్థులు ఐకమత్యంగా దేవరను జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అమ్మవారి ప్రతిమను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. జంతు బలి ఇచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలతో గ్రామం కిక్కిరిసి పోయింది. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో సీఐ హేమంతకుమార్, ఎస్ఐ విజయ్‌కుమార్ శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

డిప్యూటీ సీఎం ఆరోపణలు సరికాదు : దాదాగాంధీ

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పెహల్గామ్ దుర్ఘటన మీద పాకిస్థాన్‌కు అనుకూలంగా మాట్లాడే కాంగ్రెస్‌వారు పాకిస్థాన్‌కు వెళ్లిపోవచ్చు అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విజయవాడలో మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దాదాగాంధీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అత్యున్నత విధాన నిర్ణయ కమిటీ ఈ నెల 23న ఢిల్లీలో సమావేశమై, పాక్ ఉగ్ర చర్యలను ఖండించిందన్నారు. భారత్ తీసుకొనే అన్ని చర్యలకు కాంగ్రెస్ బేషరతుగా మద్దతు ప్రకటిస్తూ తీర్మానం చేసిందన్నారు.

ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురండి: ఎమ్మెల్యే


మార్కెట్‌యార్డు చైర్మన్, డీసీఎంఎస్ చైర్మన్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

రామగిరి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా పనిచేయాలని, రైతులతో సత్సంబంధాలు కొనసాగించాలని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌గా నియమితులైన కనగానపల్లి టీడీపీ నాయకుడు నెట్టెం వెంకటేష్, రాప్తాడు మార్కెట్‌యార్డు నూతన కమిటీ చైర్మన్ సుధాకర్, సభ్యులకు ఎమ్మెల్యే పరిటాలసునీత సూచించారు. వారు వేర్వేరుగా మంగళవారం మండలంలోని వెంకటాపురంలో పరిటాలరవి ఘాట్‌ను సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసి కృతజ్ఞతలు తెలిపి, సత్కరించారు. అలాగే నెట్టెం వెంకటేష్‌ను, సుధాకర్‌చౌదరిని ఎమ్మెల్యే సత్కరించారు.

రాప్తాడు మార్కెట్‌యార్డు కమిటీ నియామకం

● రాప్తాడు/రామగిరి: మార్కెట్‌యార్డు నూతన కమిటీని ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. ఇందులో చైర్మన్, వైస్‌చైర్మన్‌తో పాటు 15 మంది సభ్యులను ప్రకటించింది. ఎమ్మెల్యే పరిటాల సునీత దానిని విడుదల చేశారు. ఇందులో చైర్మన్‌గా వేపకుంట బోయపాటి సుధాకర్, వైస్ చైర్మన్‌గా గంగులకుంట క్రిష్ణ, డైరెక్టర్లగా దేవరకొండ సాలమ్మ, శివలక్ష్మి, చెన్నకేశవనాయుడు, పోతన్న, బాలునాయక్, రఘునాథ్ రెడ్డి, జెన్నే నాగలక్ష్మి, రామాంజినమ్మ, లక్ష్మీనరసమ్మ, అంకే మంజునాథ్, వరలక్ష్మి, రఫి, గోనుగుంట్ల సౌమ్య నియమితులయ్యారు. వీరిలో ఎనిమిది మంది ఓసీలు, నలుగురు బీసీలు, ఇద్దరు ఎస్సీలు, ఒక ఎస్టీకి అవకాశం కల్పించారు.

పోలేపల్లిలో తీరిన తాగునీటి సమస్య

రామగిరి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలేపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. పోలేపల్లి బీసీకాలనీలో దాదాపు నెలరోజులపాటు నీళ్లులేక ఇబ్బందులు పడుతుండేవారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన పోలేపల్లిలో తాగునీటికి కటకట అనే వార్తకు అధికారులు స్పందించారు. గ్రామంలోని బోరులో రెండు కొత్తగా మోటార్లను దింపి నీళ్లు వచ్చేలా చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదు

● సీహెచ్‌ఓల హెచ్చరిక ● నిరవధిక సమ్మెబాట


జిల్లా ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీహెచ్‌ఓలు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆపేదేలేదని వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ)లు పేర్కొన్నారు. మంగళవారం నుంచి విధులు బహిష్కరించి నిరవధిక సమ్మెలోకి వెళ్లారు, ఆందోళనలో భాగంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదురుగా జిల్లా ఆస్పత్రి ఎదుట టెంట్‌వేసి ధర్నా చేపట్టారు. ఉదయంనుంచి సాయంత్రం వరకు నిరసన సాగించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు గౌరి, అనూష, రాజేశ్వరి, శ్వేత తదితరులు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనల మేరకు ఆరేళ్లు పనిచేసిన వారిని రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాల్సి ఉందన్నారు. అలాగే ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలన్నారు. క్లినిక్ అద్దెలు చెల్లించాలని, నిర్ధిష్టమైన జాబ్ చార్టు ఉండాలని, ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయించాలని, హెచ్ఆర్ పాలసీ, పితృత్వసెలవులు, ఇంక్రిమెంట్లు, బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కొన్నేళ్లుగా కోరుతున్నా పట్టించుకోవడంలేదని, ఈ ప్రభుత్వమైన న్యాయం చేయాలని విజ్ఞప్తిచేశారు. అప్పటివరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. నిరసనలో జిల్లాకు చెందిన సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అన్నదాన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బాబు తదితరులు పాల్గొన్నారు.

పర్వతారోహణను ప్రోత్సాహించండి: జేసీ

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన సమీరాఖాన్ చేపట్టిన ఎవరెస్ట్ పర్వతారోహరణకు ప్రజలు విరివిగా విరాళాలు అందజేసి ప్రోత్సాహించాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ కోరారు. ఎవరెస్ట్ పర్వతారోహణ కోసం పర్వతారోహకురాలు సమీరాఖాన్ చేపట్టిన సైకిల్ యాత్రను మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జేసీ జెండా ఊపి ప్రారంభించారు. సైకిల్ ర్యాలీ సంగమేష్ సర్కిల్, సప్తగిరి సర్కిల్, సుభాష్‌రోడ్డు, టవర్‌క్లాక్ మీదుగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో సాగింది.

నందికొట్కూరు పరిశీలకుడిగా దేవళ్ల మురళి



అనంతపురం అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గ పరిశీలకుడిగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దేవళ్ల మురళి నియమితు లయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం మంగళవారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేశ్ ఆదేశాల మేరకు నందికొట్కూరు నియోజకవర్గం పరిశీలకుడగా చిత్తశుద్ధితో పని చేస్తానన్నారు.

వైసీపీ శింగనమల సమన్వయకర్తగా శైలజానాథ్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): శింగనమల నియోజకవర్గ సమన్వయకర్తగా సాకే శైలజానాథ్‌ను నియమించారు. కొన్ని నెలల క్రితం ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచి వైసీపీలో చేరిన విషయం తెలిసిందే. ఈ మేరకు మంగళవారం వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. అలాగే అనంతపురం పార్లమెంటు పరిశీలకులుగా మాజీ ఎమ్మెల్సీ బోరెడ్డి నరేష్ కుమార్‌రెడ్డి, హిందూపురానికి ఆర్ రమేష్‌రెడ్డిని నియమించారు.

జిల్లా జైలును తనిఖీ చేసిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి

అనంతపురం క్రైం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి రాజశేఖర్ మంగళవారం జిల్లా జైలు, ఓపెనర్ జైలును తనిఖీ చేశారు. జైలులో ఉన్న ఖైదీలతో మాట్లాడారు. వారికి అందుతున్న సదుపాయాలు, వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు న్యాయసలహాలు, న్యాయసేవల గురించి వివరించారు. అనంతరం ఖైదీలకు అందించే ఆహార నాణ్యతను పరిశీలించారు. న్యాయాధికారి వెంట జైలు అధికారులు ఉన్నారు.

'భూసార పరీక్షలతో సాగు ఖర్చు తగ్గింపు'

అనంతపురం రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రైతులకు సాగు ఖర్చులు తగ్గిం చేందుకు ప్రభుత్వం భూసార పరీక్షలు చేపడుతోందని భూసార పరీక్షల వ్యవసాయ అధికారి శ్రీనాథ్ రెడ్డి అన్నారు. భూసార పరీక్షలపైమంగళవారం మండలంలోని రాచానపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. మండల వ్యవసాయాధికారి శశికళ, భూసార పరీక్షల వ్యవసాయాధికారి శ్రీనాథ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఇప్పటికే జిల్లా లోని రైతు సేవా కేంద్రాల పరిధిలో మట్టి నమూనాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ పరపతి సంఘం అసిస్టెంట్ రిజిస్ట్రార్ రోషన్ జమీన్, సీఈఓ శ్రీనివాసులు, ఏఈఓ మురళీకృష్ణ, విహెచ్ఏ శివశంకర్, రైతులు పాల్గొన్నారు.

'మనిషి విలువను పెంచేది పుస్తకాలే'

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మనిషి విలువను పెంచేది ఒక మంచి పుస్తకమేనని నేషనల్ గ్రీన్ కార్ప్ రీజనల్ కోఆర్డినేటర్ ఆనంద్ భాస్కర్ పేర్కొన్నారు. అందుకే పుస్తకం హస్తభూషణం అంటారని అన్నారు. జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పుస్తక వారోత్సవాల్లో భాగంగా ఏడో రోజున మంగళవారం హౌసింగ్‌బోర్డులోని రాజీవ్ చిల్డ్రన్స్ పార్కులో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనకు ఆనంద్ భాస్కర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాగా ఈనెల 23న మొదలైన పుస్తక వారోత్సవాలు బుధవారం నాటికి ముగుస్తాయని జేవీవీ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు సాకే భాస్కర్ వెల్లడించారు. ముగింపు సందర్భంగా బుధవారం క్లాక్ టవర్ వద్ద పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేస్తామని తెలిపారు. గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అర్జున్‌నాయక్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాం రెడ్డి, లక్ష్మీనారాయణ, జేవీవీ నగర అధ్యక్ష కార్యదర్శులు రామిరెడ్డి, వీరరాజు, విరూపాక్షి, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

అనంపురం క్రైం, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రెవెన్యూ కాలనీలో నివాసముంటున్న నరసింహారెడ్డి(90)ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నరసింహారెడ్డి రెవెన్యూ కాలనీలో ఒక్కడే ఉంటున్నాడు. ఆయన కొడుకు కళ్లమడి ప్రభాకర్ రెడ్డి విజయవాడలో ఉద్యోగం చేస్తున్నాడు. రెండు నెలలకోసారి వచ్చి తండ్రిని చూసి వెళ్లేవాడు. కొన్ని నెలల క్రితం నరసింహారెడ్డికి మోకాలి ఆపరేషన్ చేశారు. మూడేళ్ల క్రితం భార్య మృతి చెందింది. అటు భార్య మృతి, ఇటు వృద్ధాప్యంతో బాధపడుతున్న నరసింహారెడ్డి మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పక్కింట్లో ఉంటున్న బంధువులు ఆలస్యంగా గుర్తించారు. కుమారుడి ఫిర్యాదు మేరకు త్రీటౌన్‌పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


గార్లదిన్నె, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): శింగనమల మండల పరిధిలోని లోలూరు సమీపంలో 44వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గార్లదిన్నెకు చెందిన వెంకట్రాముడు అనే వ్యక్తి లోలూరు సమీపంలోని సుధార్ కాటా వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వెంకట్రాముడుకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే


పిల్లలకు సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న సీడీపీఓ భారతి

నార్పల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందలవాడ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ సమావేశం నిర్వహించారు. సీడీపీఓ భారతి కిశోరి వికాసంపై అవగాహన కల్పించారు. అనంతరం ఐదేళ్ల పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మధుమాల, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దత్తమందిరంలో దేవతా పునఃప్రతిష్ఠ పూజలు


శ్రీచక్ర పూజ చేస్తున్న దత్త విజయానంద తీర్థ స్వామీజీ

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక జెడ్పీ ఎదురుగా ఉన్న దత్తమందిరంలో దేవతా పునఃప్రతిష్ఠ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం అనఘా సమేత జ్ఞానసాగర దత్తాత్రేయ, కార్యసిద్ధి ఆంజనేయ, గణపతి, దత్త నాగలింగేశ్వర, నవగ్రహ విగ్రహాలకు శాస్త్రబద్ధంగా ప్రాసాదాధివాసం, ధాన్యాధివాసం, శయ్యాధివాసం నిర్వహించారు. అంతకు ముందు గణపతి, పీఠపూజలు నిర్వహించారు. అలాగే దీక్షాహోమం, మండల దేవతా హోమం, బ్రహ్మకలశ దేవతా హోమం తదితర హోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామి హాజరై ఆలయ ఆవరణలో శ్రీచక్ర పూజలు చేశారు. కాగా బుధవారం ఉదయం 9 గంటలకు దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి హాజరై యంత్రస్థాపన, బింబప్రతిష్ఠ, అభ్యావర్తినీ హోమం, ప్రాణప్రతిష్ఠ, బింబకళాదిన్యాసం నిర్వహించనున్నారు. ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.


విగ్రహాలకు క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

శింగనమల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ పెద్దవరంలాంటిదని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. ఆమె మంగళవారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 15 మందికి రూ. 27,71,375 చెక్కులను పంపిణీ చేశారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన కేశవరెడ్డి


మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ముంటిమడుగు కేశవరెడ్డి

అనంతపురం అర్బన్/ గార్లదిన్నె/ బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): డీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా తనను నియమించినందుకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు ముంటిమడుగు కేశవరెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం విజయవాడలోని ఎయిర్ పోర్టులో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి ఉన్నారు.

మంత్రి కేశవ్‌ను సత్కరించిన కేశవరెడ్డి



● గార్లదిన్నె/బుక్కరాయసముద్రం: ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను మంగళవారం సచివాలయంలో ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, రాష్ట్ర నిర్వహక కార్యదర్శి, సీనియర్ నాయకులు గడ్డం సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కాటప్పగారి రామలింగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాయల్‌మురళి తదితరులు కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్‌కు శాలువ, పూలమాలతో సత్కరించారు.

కూడేరు బైపాస్ వరకు రోడ్డు నిర్మించాలి

● పాదయాత్రలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

గార్లదిన్నె, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రహదారుల నిర్మాణాలు ప్రభుత్వాలకు పట్టావా అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గార్లదిన్నె నుంచి కూడేరు బైపాల్ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు మంగళవారం కోటంక నుంచి గార్లదిన్నె తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రకు సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంభూపాల్ సంఘీభావం తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి గార్లదిన్నె నుంచి కూడేరు బైపాస్ వరకు రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ బండారు ఈరమ్మకు అందజేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు తరిమెల నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, మండల కార్యదర్శి చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

3 గంటలకే సచివాలయం ఖాళీ

శెట్టూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యాటకల్లు గ్రామ సచివాలయం మూడు గంటలకే ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చింది. మంగళవారం ఆంధ్రజ్యోతి 3 గంటలకు సచివాలయాన్ని విజిట్ చేయగా ఒక డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. అధికారులు ఏ ఒక్కరు కనిపించకపోవడం గమనార్హం. వివిధ పనుల మీద గ్రామ సచివాలయానికి వచ్చి ప్రజలు వెనుదిరిగి వెళుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది విధులకు హాజరయ్యే విధంగా చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ ఎంపీడీవో రఘురామారావును వివరణ కోరగా.. సర్వే నిమిత్తం వెళ్లి వుంటారని తెలిపారు. మండల స్థాయి అధికారులు సచివాలయాల పర్యవేక్షణ గాలికొదిలేయడంతోనే ఇలా డుమ్మా కొడుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.



ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న గ్రామ సచివాలయం

ఆధ్యాత్మిక భావనతో శాంతియుత జీవనం

కణేకల్లు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక భావనతోనే శాంతియుత జీవనం సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చోళ్లపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గణపతి, సీతారామలక్ష్మణ హనుమ సమేత ఆలయ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో అనేక ఒత్తిళ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిని అధిగమించాలంటే దైవస్మరణతోనే సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనందరాజ్, శేషప్ప, నీలకంఠ రెడ్డి, వేణు, ప్రసాద్, బీటీ రమేష్, నవీన్, నాగరాజు, అనిల్, చాంద్‌బాష తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న విప్ కాలవ

● ఏఓపై విప్ ఆగ్రహం

మండల వ్యవసాయ అధికారి శ్రావణ్ కుమార్‌పై విప్ కాలవ శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కణేకల్లు పరిధిలో రబీ సీజన్‌లో రైతులు సాగుచేసిన వరి పంటకు ఈక్రాప్ నమోదు చేయడంలో ఏఓ నిర్లక్ష్యం వహించారంటూ టీడీపీ నాయకులకు రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. దీంతో విప్‌కు టీడీపీ నాయకులు ఈ విషయాన్ని తెలియజేయగా చోళ్లపురం వచ్చిన ఏఓ శ్రావణ్‌పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఈక్రాప్ నమోదు వేగవంతం చేయాలని ఏఓను ఆదేశించారు.

సంక్షిప్త వార్తలు

ఘనంగా పరశురాముడి జయంతి


పరశురాముడి మూలవిరాట్ వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసాపురం గ్రామంలో వెలసిన లక్ష్మీనారాయణస్వామి రాతిదేవాలయంలో మంగళవారం పరశురాముడి జయంతిని ఘనంగా నిర్వహించారు. అర్చకులు పరుశురాముడు విగ్రహానికి విశేష అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు తలారి పరుశురాముడు, శకుంతలమ్మ, అర్చకులు చెన్నకేశవస్వామి, మల్లికార్జునస్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో చోరీ

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కసాపురం రోడ్డు అయ్యప్పస్వామి దేవాలయం వెనక నివాసముంటున్న రైల్వే విశ్రాంత ఉద్యోగి సూర్యనారయణరాజు ఇంట్లో చోరీ జరిగింది. కసాపురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సూర్యానారాయణరాజు రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి పుట్టపర్తికి వెళ్లాడు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా.. తాళాలు తెరచి ఉండటాన్ని గుర్తించారు. బీరువాలో ఉన్న ఆరు తులాలు బంగారు నగలు, రూ. 12వేల నగదు దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ రాఘవేంద్ర ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గుత్తిరూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన రామకృష్ణ అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. రామకృష్ణ మంగళవారం తురకపల్లి వద్దకు వెళ్లి తన తమ్ముడికి ఫోన్ చేసి పురుగుల మందు తాగానని తెలిపాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఆర్డీటీ సేవలను పునరుద్ధరించాలి

ఉరవకొండ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు చొరవచూపి ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని దళిత సంఘాల నాయకులు కోరారు. వజ్రకరూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం నిర్మూలించడానికి ఆర్డీటీ ఎంతగానో కృషి చేసిందన్నారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను నిలిపివేయడం బాధకమన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఏసన్న, బాల రామాంజనేయులు, రవీంద్రబాబు, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక దోనిముక్కల రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ సంస్థ అధికారి వెంకటేశ్వరి మాట్లాడుతూ.. పిల్లలను బావులు, చెరువులు, కుంటలు దగ్గరికి పంపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోని తెలిపారు. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యానేరం అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గుత్తి రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కలచెరువు గ్రామశివారులోని 67వ జాతీయ రహదారిపై ఈ నెల 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విజయ్ (22) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. గుత్తి పట్టణంలోని జంగాల కాలనీకి చెందిన విజయ్ బైక్‌లో గుత్తి నుంచి తాడిపత్రికి వెళ్తుండగా జక్కలచెరువు గ్రామ శివారులోకి రాగానే అదుపుతప్పి బోల్తా పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం బెంగుళూరుకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించండి

గుత్తి రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కౌన్సిలర్లు పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూరుబీ అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. సమస్యలు పరిష్కరించలేనపుడు ఎందుకు ఈ సమావేశాలు అంటూ కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏళ్ల సమస్యలు గడుస్తున్నా సమస్యలు పరిష్కరం కావడంలేదన్నారు. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని కమిషనర్ జబ్బర్‌మియా తెలిపారు.

జిల్లా జైలును తనిఖీ చేసిన డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి

అనంతపురం క్రైం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి రాజశేఖర్ మంగళవారం జిల్లా జైలు, ఓపెనర్ జైలును తనిఖీ చేశారు. జైలులో ఉన్న ఖైదీలతో మాట్లాడారు. వారికి అందుతున్న సదుపాయాలు, వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు న్యాయసలహాలు, న్యాయసేవల గురించి వివరించారు. అనంతరం ఖైదీలకు అందించే ఆహార నాణ్యతను పరిశీలించారు. న్యాయాధికారి వెంట జైలు అధికారులు ఉన్నారు.

అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళదాం: కాలవ

రాయదుర్గం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయభేరీ మోగిద్దామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పట్టణంలోని వరసిద్ధి వినాయక కల్యాణమండపంలో మంగళవారం ఆయన పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసుకుంటూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధించాలని తెలిపారు. గ్రామ, వార్డు స్థాయి నుంచి పార్టీ కమిటీలను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న వారికి పదవులు అప్పగిస్తున్నామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికి ముఖ్యమంత్రి వెనుకపడ్డ రాయదుర్గం ప్రాంతానికి చేయూతనిస్తున్నారని అన్నారు. రాయదుర్గంలో బాలకల జూనియర్ కళాశాల, వందపడకల ఆసుపత్రి, బీటీపీకి కృష్ణాజలాల తరలింపు, ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి, పరిశ్రమల ఏర్పాటు, నాణ్యమైన విద్యుత్, తుంగభద్ర ఎగువకాలువ ఆధునికీరణ, ఆవులదట్ల బ్రాంచ్ కాలువ, రైల్వేబ్రిడ్జిల ఏర్పాటు, రహదారుల విస్తరణ, కొత్తగా తారు రోడ్డు, గ్రామాల్లో సిమెంట్ రహదారులు ఇలా.. ఎన్నో ప్రజామోదమైన పనులను చేపట్టామన్నారు. వినతి పత్రాలు సమర్పించి ఊరికే కూర్చుంటే పనులు జరగవన్నారు. సంబంధిత మంత్రులు ఉన్నతాధికారులను పదేపదే కలసి గుర్తుచేయటం వల్లనే సాధ్యం అవుతాయన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ

పహల్గాం మృతులకు కొవ్వొత్తులతో నివాళి

గుంతకల్లు టౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి పహల్గాం మృతులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయం నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి బి. సురేష్ మాట్లాడుతూ.. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపి 28 మందిని హత్య చేయడం దుర్మార్గం అన్నారు. మృతి చెందిన కుటుంబాలకు తమ పార్టీ తరపున తీవ్ర సంతాపాన్ని తెలుపుతున్నామన్నారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథ్‌రెడ్డి, జిలాన్, సత్తార్, రామాంజనేయులు, ఆశాబీ, మాబున్ని, రామదాస్, నారాయణ, బాష, గోపి, షేక్షావలి పాల్గొన్నారు.


కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న నాయకులు

ఉపాధి పనులను పరిశీలించిన పీడీ

పుట్లూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లి, గోపరాజుపల్లి గ్రామాల్లో మంగళవారం ఉపాధిహామీ పనులను డ్వామా పీడీ సలీంబాషా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీల హాజరుశాతం పెంచాలన్నారు. పండ్లతోటల పెంపకం సాగు మరింత పెంచాలని సూచించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న పశువుల నీటితొట్టెను, ఫాంపాండ్లు, ఇంకుడు గుంతలు, పశువుల షెడ్లను తనిఖీ చేశారు.


పండ్లతోటను పరిశీలిస్తున్న పీడీ సలీంబాషా

సమ్మర్ స్పెషల్ క్యాంపులను జయప్రదం చేయండి


స్పెషల్ క్యాంపుల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కమిషనర్, సీడీపీవో

కళ్యాణదుర్గం రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : మహిళా అభివృద్ధి, శిశు సంరక్షణ కోసం ఏర్పాటు చేయనున్న సమ్మర్ క్యాంపులను జయప్రదం చేయాలని మున్సిపల్ కమిషనర్ వంశీ కృష్ణ భార్గవ్, సీడీపీవో ప్రసన్న లక్ష్మీ పేర్కొన్నారు. మంగళవారం యూనిసెఫ్, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళల హక్కులు, వాటి పరిరక్షణ కోసం చేపట్టాల్సిన కార్యాచరణ కార్యక్రమం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ యూనిసెఫ్, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ తయారు చేసిన ఆరు రకాలైన పుస్తకాలను మహిళా సంరక్షణ కార్యదర్శులకు అందజేశారు. సమావేశంలో మహిళా సంరక్షణ కార్యదర్శులు, సూపర్‌వైజర్ భారతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీలు హద్దుమీరితే చర్యలు తప్పవ్

శెట్టూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా పనిచేస్తున్న ఆర్ఎంపీలు హద్దుమీరితే చర్యలు తప్పవని శెట్టూరు ప్రాథమిక వైద్యఆరోగ్య కేంద్రం వైద్యాధికారి తరుణ్ సాయి హెచ్చరించారు. మంగళవారం ఆర్ఎంపీలకు ప్రాథమిక వైద్యం గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హద్దు మీరి చికిత్సలు నిర్వహించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని సూచించారు. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. ఎలాంటి ఆపరేషన్లు, చికిత్సలు నిర్వహించరాదన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి, ఎంపీడీవో రఘురామారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైద్యాధికారి తరుణ్‌సాయి

బాల్యవివాహాలతో అనర్థాలు

బ్రహ్మసముద్రం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో అనేక అనర్థాలు జరుగుతాయని మండల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాణి ఎస్తేర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పిల్లలపల్లిలో మంగళవారం బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం నల్లక్క, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సిక్ లీవులకు పూర్తి జీతం చెల్లించాలి: ఎన్ఎంయూ



రిలే దీక్ష చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

రాయదుర్గం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు అనారోగ్యానికి గురైనప్పుడు తీసుకునే సిక్‌లీవులకు పూర్తి జీతం చెల్లించాలని ఎన్ఎంయూ డిపో కార్యదర్శి హెచ్‌టీ స్వామి డిమాండ్ చేశారు. ఆర్టీసీ డిపో ఆవరణంలో మంగళవారం ఎన్ఎంయూ రెండో రోజు రిలే దీక్షలను నిర్వహించింది. తమ సమస్యలు పరిష్కారమయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామని, ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రెండో రోజు రిలే నిరాహార దీక్షలో పది మంది ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వం లేదా సంస్థ ద్వారా మాత్రమే కొనాలని, గ్యారేజ్ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగరాజు, జోనల్ ఉపాధ్యక్షుడు ఎంఎండీ షఫీ, నాయకులు ఏఎస్ నాయుడు, రవికుమార్ నాయకులు పాల్గొన్నారు.

● తాడిపత్రి : స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలేనిరాహార దీక్షలు మంగళవారం కొనసాగాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు టీపీ నారాయణ మాట్లాడుతూ.. ఆర్టీసీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలన్నారు. నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్‌లను వెంటనే ఇవ్వాలన్నారు. మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలన్నారు. ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్యవిధానాన్ని కొనసాగించాలన్నారు. దీక్షలో నాయకులు శశికళ, కుమారి, రమణయ్య, శేఖర్, నీలకంఠయ్య, రాజు, రంగయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ అవినీతిపై విచారణ

విడపనకల్లు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఎంపీడీఓ ఏవీ శ్రీనివాసులు అవినీతి అక్రమాలపై మంగళవారం విచారణ చేపట్టారు. ఈ నెల 8న విడపనకల్లులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డొనేకల్లు గ్రామ సర్పంచ్ పేట్లో ఎర్రమ్మ, మాజీ సర్పంచ్ కుమారుడు గాదిలింగా ఎంపీడీఓ అవినీతిపై రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఫిర్యాదు చేశారు. వీటిపై విచారించి సమగ్ర నివేదికలు ఇవ్వాలని జిల్లా అధికారులు డీఎల్‌పీఓను విచారణ అధికారిగా నియమించారు. దీంతో డీఎల్‌పీఓ రంగనాయకులు మంగళవారం డొనేకల్లు గ్రామం చేరుకుని గ్రామ పెద్దలు, ప్రజలతో విచారణ చేపట్టారు. గ్రామస్థులు మాట్లాడుతూ.. డొనేకల్లు గ్రామంలో రోడ్డు విస్తరణ పనుల్లో పాత పంచాయతీ కార్యాలయ భవనాన్ని తొలగిస్తారని తెలిసి కూడా ఎంపీడీఓ డబ్బుల కోసం రంగులు వేయించారని అన్నారు. డొనేకల్లు-ఆర్.కొట్టాల రోడ్డుకు ఫ్లడ్ డ్యామేజీ కింద రెండు విడతల్లో రూ. 13 లక్షలు వెచ్చించి మట్టి రోడ్డు వేయించామని అన్నారు. ఇదే రోడ్డుకు బీటీ రోడ్డు మంజూరయిందని, పంచాయతీ తీర్మానం లేకుండా అధికారులకు తెలియకుండా మట్టి పనులు చేసినట్లు పంచాయతీ గ్రాంటును విడతల వారిగా రూ.4లక్షలు, రూ.6లక్షలు బినామీ పేర్లతో పీఆర్ రిటైర్డు ఏఈ మధు, ఎంపీడీఓ ఏవీ శ్రీనివాసులు ఇద్దరు కలిసి బిల్లులు డ్రా చేశారని విచారణ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. పంచాయతీ నిధులను తీర్మానాలు లేకుండా మరోసారి రూ. 18 లక్షలు డ్రా చేశారని విచారణ అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సత్య ఏసుబాబు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు పంచాయతీరాజ్‌శాఖ ఎస్ఈ విచారణకు డొనేకల్లుకు వస్తున్నట్లు ఈఓఆర్డీ తెలిపారు.


విచారిస్తున్న డీఎల్‌పీఓ రంగనాయకులు

ఘనంగా పెద్దమ్మ జాతర

తాడిపత్రి, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊరుచింతల గ్రామంలో పెద్దమ్మ జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. 14 సంవత్సరాల తర్వాత జాతరను నిర్వహించారు. జాతరకు బంధువులు, చుట్టుపక్కల గ్రామస్తులు మిత్రులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకోవడానికి తరలివచ్చారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, ఎస్‌ఐ ధరణీబాబు బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తన అనుచర నాయకుల ఇళ్లకు వెళ్లి అందరిని పలకరించారు. ఆయన వెంట నాయకులు, ఎస్వీ రవీంద్రారెడ్డి ఉన్నారు. కండ్లగూడూరు గ్రామంలో టీడీపీ కార్యకర్తను పరామర్శించేందుకు జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆ గ్రామానికి వెళ్లారు.


ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మ

కొల్లాపురమ్మ జాతరలో ఎంపీ, ఎమ్మెల్యే

కంబదూరు : మండల పరిధిలోని గూళ్యం గ్రామంలో నిర్వహించిన కొల్లాపురమ్మ జాతరకు హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారికి స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో వెలసిన కొల్లాపురమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. ఆయాశాఖల అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు అమిలినేని లక్ష్మీనారాయణ, గాజుల శ్రీరాములు, శివన్న, అశోక్ పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ నాయకుడి మృతి

కూడేరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొర్రకోడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఏకిల ప్రకాష్ (56) గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులు సంతాపం తెలిపారు. పార్టీ కోసం నిరంతరం కృషి చేసినట్లు నాయకులు తెలిపారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని, కుటుంబానికి అండగా ఉంటామని పయ్యావుల సోదరులు భరోసా కల్పించినట్లు స్థానిక నాయకులు తెలిపారు.


ప్రకాష్ (ఫైల్)

రేపటి నుంచి వేసవి క్రికెట్ శిక్షణ

గుంతకల్లు టౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌జేపీ హైస్కూల్‌లో మే 1నుంచి ఆర్డీటీ ఆధ్వర్యంలో వేసవి క్రికెట్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు గుంతకల్లు మండల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ హరినాథ్‌గౌడ్, ఆర్డీటీ క్రికెట్ కోచ్ ఇనాయతుల్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి 31 వరకు క్రికెట్ శిక్షణ ఇస్తామని అన్నారు. శిక్షణ పాల్గొనే వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అన్యమత ప్రచార బోర్డు తొలగింపు


అధికారులతో మాట్లాడుతున్న హిందూ చైతన్య వేదిక సభ్యులు

తాడిపత్రి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని తాడిపత్రి ఔటర్ రింగ్‌రోడ్డు వద్ద జాతీయ రహదారికి సంబంధించిన సూచిక బోర్డులో అన్యమత ప్రచారానికి సంబంధించిన షాలెం చర్చికి దారి అన్న బోర్డును ఆర్‌అండ్‌బీ అధికారులు మంగళవారం తొలగించారు. రెండురోజుల క్రితం హిందూచైతన్య వేదిక సభ్యులు నిరసన తెలపడంతో స్పందించిన అధికారులు చర్చికి సంబంధించిన బోర్డును తొలగించారు. దీంతో వేదిక సభ్యులు హర్షం వ్యక్తంచేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను సభ్యులు నారాయణస్వామి, రామాంజనేయులు గంగాధర్, రంగనాయకులు, కృష్ణమోహన్ కోరారు.